www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 1 | | సంచిక: 261 | | 7-4-2026 | | మంగళవారం | | పేజీలు: 8 | | వెల : రూ.5/-

నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతీదేవి ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకున్న సీఎం.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాసర అమ్మ వారి చెంత తన మనవడు రియాన్ష్‌కు అక్షరాభ్యాసం చేయించారు. రూ.225 కోట్లతో బాసరలో కొత్తగా ఆలయ శిఖరాలు, మండపాలు, మాడవీధులు ఇతర అభివృద్ధి పనులు చేపట్టేలా తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.



# బాసర క్షేత్రానికి నూతన శోభ

## రూ.225 కోట్లతో పునర్నిర్మాణం

**మనవడికి అక్షరాభ్యాసం చేయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**శృంగేరి పీఠాధిపతుల సూచనలతో అద్భుత మాస్టర్ ప్లాన్**

**62 వేల చదరపు అడుగులకు ఆలయ విస్తరణ**

**వచ్చే ఏడాది పుష్కరాల నాటికి పనులు పూర్తి**

**9 అంతస్తుల రాజగోపురం.. అధునాతన వసతులు**

**నిర్మల్, ఏప్రిల్ 6:** దక్షిణ భారతదేశంలో ఏకైక జ్ఞాన సరస్వతి క్షేత్రమైన బాసర దేవాలయం పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. కుటుంబ సమేతంగా ఆలయాన్ని దర్శించుకున్న ఆయన.. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తన మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం రూ.225 కోట్లతో చేపట్టబోయే ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

**శృంగేరి పీఠాధిపతుల సూచనలతో..**

బాసర ఆలయాన్ని ఆగమ శాస్త్రం, సంప్రదాయాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రూపొందించింది. ఇందుకోసం అధికారులు శృంగేరి పీఠాధిపతులతో సంప్రదింపులు జరిపి వారి సూచనల మేరకు గర్భాలయం,

మిగతా 2 లో




## ఆదిలాబాద్‌కు గోదావరి జలాలు

- తుమ్మిడిహట్టి నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన

# ఢిల్లీ అసెంబ్లీ వద్ద భద్రతా వైఫల్యం

**సెక్యూరిటీని ఛేదించుకుని దూసుకు వచ్చిన కారు**

**కారును స్వాధీనం చేసుకుని, డ్రైవర్ అరెస్ట్** 2



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** ఢిల్లీ అసెంబ్లీ వద్ద సోమవారం కీలకమైన భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. సెక్యూరిటీని ఛేదించుకుని ఓ కారు దూసుకు వచ్చింది. ఉత్తరప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఒక వాహనం బలవంతంగా అసెంబ్లీ ఆవరణలోకి అడుగుపెట్టినట్టు అధికారులు తెలిపారు. ఈ ఘటన సంచలనం సృష్టించగా,

మిగతా 2 లో

## హామీల అమలులో మాది ప్రత్యేక శైలి



- పీపుల్స్ మార్చ్ హామీలకు జీవోలతో కార్యరూపం
- 22,500 కోట్ల రుణమాఫీతో రైతులకు భరోసా
- ఏడాదిలోనే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- ప్రతి కుటుంబానికి 5 లక్షల ఇందిరమ్మ బీమా
- వ్యక్తిగత అజెండా లేదు.. ప్రజా సంక్షేమమే ముఖ్యం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

.. వివరాలు 2లో



## చంద్రుడి కక్ష్యలోకి ఆర్టెమిస్-2 మిషన్

నేటి తెల్లవారు జామున చేరుకునే ఛాన్స్


.. వివరాలు 3లో



## ఇరాన్‌పై భీకర వైమానిక దాడులు

13 మంది దుర్మరణం

.. వివరాలు 4లో



## అక్రిడిటేషన్లకు లైన్ క్లియర్!

- 10న రాష్ట్ర స్థాయి కమిటీ భేటీ
- ఏప్రిల్ లోనే కొత్త కార్డుల పంపిణీ
- దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం
- స్పెషల్ కమిషనర్ ప్రియాంక

.. వివరాలు 3లో

# నేచర్ క్యూర్‌లో ‘ఈట్ రైట్ మేళా’

**కల్తీలేని ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం**

**మిల్లెట్ స్టాళ్లను సందర్శించిన మంత్రి దామోదర రాజనర్సింహ**

**ఆహార నాణ్యతపై ప్రజలకు అవగాహన అవసరమని వెల్లడి**



ప్రజారోగ్యంపై వాకథాన్ జెండా ఊపిన మంత్రి దామోదర



# పాతబస్తీని మజ్లిస్‌కు రాసిచ్చారా?


**పోలీసులపై దాడులు చేస్తున్నా చర్యలేవి?**

**పాతబస్తీకి ఒక రూల్.. వేరే ప్రాంతాలకు మరో రూలా?**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్** 3

## అధికారుల విధులకు ఆటంకం

ఎంఐఎం కార్పొరేటర్ మహమ్మద్ గౌస్ కుమారుడి అరెస్ట్ 3



# గజ్వేల్ బంద్ సక్సెస్

- రోడ్డెక్కిన బీఆర్ఎస్ శ్రేణులు
- డిపోలకే పరిమితమైన బస్సులు.. మూతపడ్డ షాపులు
- కాంగ్రెస్ తీరుపై వంటేరు ప్రతాప్ రెడ్డి నిప్పులు
- ప్రతిపక్షాలపై దాడులు ఆపాలని డిమాండ్ 3






# నేచర్ క్యూర్‌లో 'ఈట్ రైట్ మేళా'

## కల్తీలేని ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

### మిల్లెట్ స్టాళ్లను సందర్శించిన మంత్రి దామోదర రాజనర్సింహ

### ఆహార నాణ్యతపై ప్రజలకు అవగాహన అవసరమని వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 6:** ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పోషకాహారంపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు బల్కంపేటలోని నేచర్ క్యూర్ హాస్పిటల్‌లో సోమవారం 'ఈట్ రైట్ మేళా'ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొని, వివిధ స్టాళ్లను సందర్శించారు. మేళాలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ ఆహార స్టాళ్లను మంత్రి ఆసక్తిగా తిలకించారు. ముఖ్యంగా చిరుధాన్యాలతో (మిల్లెట్స్) తయారు చేసిన ఐస్‌క్రీమ్, కాఫీ వంటి వినూత్న పదార్థాలను ఆయన రుచి చూసి, వాటి తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇప్ప పువ్వుతో లడ్డూలు తయారు చేసి విజయవంతంగా వ్యాపారం నిర్వహిస్తున్న మహిళా సంఘం సభ్యురాలిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా 'ఇందిరా మహిళా శక్తి' పథకం ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన గుర్తుచేశారు. పాలు, నూనెలు, మసాలా దినుసులు, పప్పు ధాన్యాలలో జరిగే కల్తీని సామాన్యులు ఎలా గుర్తించాలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రదర్శించిన పద్ధతులను మంత్రి పరిశీలించారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఆహార కల్తీపై ఫిర్యాదు అందితే తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. "ఏం తినాలో, ఎంత తినాలో తెలుసుకోవడం ఎంత ముఖ్యమో.. మనం తినే ఆహార నాణ్యతను తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యం. వీలైనంత వరకు ఇంట్లో వండిన ఆహారానికే ప్రాధాన్యత ఇవ్వాలి" అని అన్నారు. బిజీ లైఫ్ వల్ల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నామని, రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వాకింగ్, యోగా లేదా ఏదైనా శారీరక శ్రమ ఉండేలా చూసుకోవాలని సూచించారు. సరైన నిద్ర, సమయానికి భోజనం లేకపోవడం వల్ల ఒత్తిడి పెరుగుతుందని, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా ముఖ్యమని పేర్కొన్నారు. అనంతరం, నిబంధనలు పాటిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్ల ప్రతినిధులకు 'హైజీన్ సర్టిఫికెట్లను', స్ట్రీట్ ఫుడ్ వెండర్లకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను మంత్రి అందజేశారు. అలాగే ఫుడ్ సేఫ్టీ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫుడ్ సేఫ్టీ అధికారులు, సైంటిస్టులు మరియు ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజారోగ్యంపై వాకథాన్

### జెండా ఊపిన మంత్రి దామోదర

**హైదరాబాద్,ఏప్రిల్ 6 :** శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే మానసికంగా దృఢంగా ఉండగలమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ఆరోగ్య వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ మేరకు పీవీ మార్గ్ జలవిహార్ నుంచి హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ వరకు ఏర్పాటు చేసిన వాకథాన్‌ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. వాకథాన్‌లో పాల్గొన్న వారితో కలిసి మంత్రి జలవిహార్ నుంచి హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ వరకు నడిచారు. కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ జీవితంలో వ్యాయామాన్ని భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ వారం రోజుల పాటు ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు.

# ఢిల్లీ అసెంబ్లీ వద్ద భద్రతా వైఫల్యం

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, గేట్ నెంబర్ 2 వద్దనున్న ఇనుప బ్యారియన్‌ను ఛేదించుకుంటూ ఒక వాహనం అసెంబ్లీ ఆవరణలోకి అడుగుపెట్టింది. వాహనం డ్రైవరు స్పీకర్ విజేందర్ గుప్తా కార్యాలయం వైపు దూసుకుపోయాడు. కార్యాలయం ముందు ఫ్లవర్ బోకే ఉంచడంతో పాటు స్పీకర్ కారుపై ఇంకు చల్లినట్టు గుర్తించారు. ఘటన అనంతరం వాహనం అక్కడి నుంచి వెళ్లిపోయింది. హైసెక్యూరిటీ జోన్‌లో ఈ ఘటన చోటుచేసుకోవడం భద్రతా ఆందోళనలను మరింత పెంచినట్టు చెబుతున్నారు. ఈ ఘటనపై అప్రమత్తమైన ఢిల్లీ పోలీసులు వెంటనే విచారణ చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి కారును స్వాధీనం చేసుకున్నారు. కాగా, అసెంబ్లీ ప్రాంగణంలో ఉంచిన పుష్పగుచ్ఛంలో ఎలాంటి బాంబు లేదని పోలీసులు తేల్చారు. ప్రస్తుతం సీసీటీవీ ఫుటేజ్‌ను స్కానింగ్ చేసి వాహనం డ్రైవరు ఈ ఘటనకు పాల్పడడానికి కారణంపై విచారణ జరుపుతున్నారు. ఇటీవల ముగిసిన ఢిల్లీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సమయంలోనూ అసెంబ్లీకి బాంబు బెదిరింపులు వచ్చాయి. తాజా ఘటనతో హైసెక్యూరిటీ జోన్‌లో భద్రతా ఉల్లంఘనలు మరింత అందోళనలను కలిగిస్తున్నాయి.



# ఆదిలాబాద్‌కు గోదావరి జలాలు

- తుమ్మిడిహట్టి నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన
- జిల్లాకు యూనివర్సిటీ మంజూరు.. పర్యాటకానికి పెద్దపీట
- బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి
- పిప్రిలో రూ.695 కోట్ల పనులకు భూమిపూజ
- ప్రతిపక్ష ఎమ్మెల్యేలు శత్రువులు కాదు.. రాజకీయ ప్రత్యర్థులే
- సీఎం రేవంత్‌రెడ్డి



**ఆదిలాబాద్, ఏప్రిల్ 6:** గత పాలకులు తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టిని నిర్మించి జిల్లాలో గోదావరి నీళ్లు పారిస్తుందని ప్రకటించారు. ఆదిలాబాద్ జిల్లా పిప్రిలో సోమవారం పర్యటించిన ఆయన.. రూ.695 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం నిర్వహించిన ప్రగతి పాలన బహిరంగ సభలో మాట్లాడుతూ జిల్లాను పర్యాటకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, జిల్లాకు యూనివర్సిటీ మంజూరు చేస్తామని వెల్లడించారు.

### అభివృద్ధిలో రాజకీయాలు లేవు

విపక్ష ఎమ్మెల్యేలను కాంగ్రెస్ ప్రభుత్వం శత్రువులుగా చూడదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ తమకు రాజకీయ ప్రత్యర్థులు మాత్రమేనని, అందుకే అభివృద్ధి పనుల కార్యక్రమానికి విపక్ష ఎమ్మెల్యేలను కూడా ఆహ్వానించామని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి వస్తుంటే విపక్ష నేతలను అరెస్టులు చేసి గృహనిర్బంధం చేసేవారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం పార్టీలు చూడకుండా అన్ని ప్రాంతాలకు నిధులు ఇస్తోందని చెప్పారు. 2029 వరకు జిల్లాలు, మండలాల హద్దులు మార్చవద్దని కేంద్రం చెప్పిందని.. ఆ ఆంక్షలు తొలగిపోగానే పరిపాలన సౌలభ్యం కోసం హద్దులు మారుస్తామని వివరించారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలోని ఆలయాలన్నింటినీ అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

### సంక్షేమమే ధ్యేయం

రాష్ట్రంలో ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి అనే ఆశయంతో ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని, గత ప్రభుత్వం ఇవ్వని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని చెప్పారు. ఇందుకోసం ఇప్పటికే రూ.5,400 కోట్లు పేదల ఖాతాల్లో వేశామని వెల్లడించారు. రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని గర్వంగా చెప్పారు. యువత మత్తు బాట వీడి మైదానాల బాట పట్టాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పిప్రి నుంచే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ చేపట్టి ప్రజల కష్టాలు తెలుసుకున్నారని గుర్తు చేశారు.

### పోరాట యోధుల గడ్డ

ఆదిలాబాద్ ప్రజలు అమాయకులే కాదు.. నిరంకుశత్వంపై పోరాడిన వీరులని రేవంత్‌రెడ్డి కొనియాడారు. కుమురం భీం వంటి ఆదివాసీ యోధులు నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన గడ్డ ఇది అని ప్రశంసించారు. జిల్లాకు ఇంకా ఆధునిక విద్య, వైద్యం అందాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, ఎంపీ గోడం నగేశ్, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. జిల్లా అభివృద్ధి కోసం కాంగ్రెస్ కార్యకర్తలు అనేక ఒత్తిళ్లు, బెదిరింపులు తట్టుకొని పోరాడారని ముఖ్యమంత్రి అభినందించారు.



# బాసర క్షేత్రానికి నూతన శోభ

మొదటి పేజీ తరువాయి

రాజగోపురం, మాడ వీధుల నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నారు. ప్రస్తుతం 2 వేల చదరపు అడుగుల్లో ఉన్న గర్భాలయం, అర్ధ మండపాన్ని 5 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు. మొత్తంగా ఆలయ విస్తీర్ణం 20 వేల నుంచి 62 వేల చదరపు అడుగులకు పెరగనుంది. ఆలయంలో ప్రతి నిర్మాణం శిలలతోనే జరగనుంది. ఉత్తరం వైపు 9 అంతస్తుల రాజగోపురం, మిగిలిన మూడు దిక్కుల్లో 7 అంతస్తుల గోపురాలు నిర్మిస్తారు.

### అధునాతన వసతులు.. క్యూ కాంప్లెక్స్

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 70 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 6 వేల మంది పట్టేలా అత్యాధునిక క్యూ కాంప్లెక్స్ లు నిర్మించనున్నారు. ఏకకాలంలో 200 మంది ధ్యానం చేసుకునేలా ధ్యాన మందిరం, 20 వేల చదరపు అడుగుల్లో వంటశాల, భోజన శాలలు ఏర్పాటు చేస్తారు. దేవాలయానికి తూర్పు దిక్కున ఆధ్యాత్మిక తోరణాలు, సమాచార కేంద్రం, పుష్పవనం వంటివి ఏర్పాటు చేయనున్నారు. భక్తుల సౌకర్యార్థం అండర్ పాస్, సోలార్ రూఫ్ టాప్ తో కూడిన వాహన పార్కింగ్, హెల్త్ సెంటర్ ను కూడా ఈ మాస్టర్ ప్లాన్ లో చేర్చారు.



### పుష్కరాల నాటికి సిద్ధం

వచ్చే ఏడాది జూన్ లో గోదావరి పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. ఆ సమయానికి లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వేద వ్యాస మహర్షి ప్రతిష్టించిన ఈ ముగ్గురమ్మల క్షేత్రం పునర్నిర్మాణంతో ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఆలయ సంప్రదాయాలు, భక్తుల విశ్వాసాలకు భంగం కలగకుండా ప్రతి పని పారదర్శకంగా జరగాలని స్పష్టం చేశారు.

# హామీల అమలులో మాది ప్రత్యేక శైలి



- పీపుల్స్ మార్చ్ హామీలకు జీవోలతో కార్యరూపం
- 22,500 కోట్ల రుణమాఫీతో రైతులకు భరోసా
- ఏడాదిలోనే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- ప్రతి కుటుంబానికి 5 లక్షల ఇందిరమ్మ బీమా
- వ్యక్తిగత అజెండా లేదు.. ప్రజా సంక్షేమమే ముఖ్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ఆదిలాబాద్, ఏప్రిల్ 6:** అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా పిప్రిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పిప్రిలో ప్రారంభమైన తన యాత్ర ఖమ్మం వరకు కొనసాగిందని, ఆనాడు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ నేడు జీవోలు జారీ చేశామని తెలిపారు. పిప్రి ప్రాంతంలో 1,238 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు.

### పేదల సంక్షేమమే పరమావధి

ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క వివరించారు. ఒకే విడతలో 22,500 కోట్ల రుణమాఫీ చేసి రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో పేదల కోసం 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, మొదటి ఏడాదిలోనే 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రతి కుటుంబానికి 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ బీమా పథకం వర్తింపజేస్తున్నామని, ఇది ఇతర రాష్ట్రాల నేతలను కూడా ఆశ్చర్యపరుస్తోందని అన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన తమకు పేదల కష్టాలు తెలుసని, తమకు ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనాలు లేవని, కేవలం ప్రజా సంక్షేమమే లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ రాష్ట్రంలో పుట్టినందుకు ప్రతి పౌరుడు గర్వపడేలా పాలన సాగిస్తామని భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు.



# ఆడబిడ్డలకు నాణ్యమైన చీరలు

### ఈ యేడాది ఆకుపచ్చ రంగులో సారె: రేవంత్

**ఆదిలాబాద్, ఏప్రిల్ 6:** గత ప్రభుత్వాల హయాంలో పంపిణీ చేసిన చీరల రంగులు, నాణ్యతపై ప్రజల్లో భిన్నభిప్రాయాలు ఉండేవని గుర్తు చేస్తూ, తమ ప్రభుత్వం మహిళల మనసు గెలుచుకునేలా కొత్త నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఆదిలాబాద్ జిల్లా పిప్రిలో జరిగిన భారీ బహిరంగ సభలో మహిళా లోకానికి బతుకమ్మ శుభవార్త చెప్పారు. రాష్ట్రంలోని ఆడబిడ్డలకు తమ ప్రభుత్వం ఇచ్చే చీరలు కేవలం వస్త్రాలు మాత్రమే కాదని.. అవి పుట్టింటి వారు ప్రేమతో పెట్టే 'సారె' అంత పవిత్రమైనవని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. గతంలో పాలపిట్ట రంగు చీరలను పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఈసారి అంతకంటే ఆకర్షణీయమైన, మహిళలకు ఎంతో ఇష్టమైన 'చిలుక పచ్చ' రంగు చీరలను అందించబోతున్నామని స్పష్టం చేశారు. ఈ ప్రత్యేకమైన చిలుక పచ్చ రంగు చీరలను వచ్చే డిసెంబర్ నెలలో పంపిణీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. పండగలు, శుభకార్యాల సమయంలో ఆడబిడ్డలు గర్వంగా ధరించేలా నాణ్యమైన చీరలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళల గౌరవాన్ని పెంచేలా, వారి ముఖాల్లో చిరునవ్వులు చూసేలా ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు తెలిపారు. ఆదాయం పెంచి పేదలకు పంచడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని.. ఇప్పుడు నాణ్యమైన చీరల పంపిణీ ద్వారా ఆడబిడ్డల పట్ల తమకున్న అంకితభావాన్ని చాటుకుంటున్నామని చెప్పారు. మహిళా శక్తిని గౌరవించడంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.



# చంద్రుడి కక్ష్యలోకి ఆర్టెర్‌మిస్-2 మిషన్

## నేటి తెల్లవారు జామున చేరుకునే ఛాన్స్

**వాషింగ్టన్, ఏప్రిల్ 6:** చంద్రుడిని చుట్టి వచ్చేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా చేపట్టిన ఆర్టెర్‌మిస్-2 మిషన్ మరి కొన్ని గంటల్లో సరికొత్త రికార్డు నెలకొల్పనుంది. ఈ మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములతో కూడిన ఒరాయన్ వ్యోమనౌక ఇప్పటికే చంద్రుడి గురుత్వాకర్షణ ప్రభావం పరిధిలోకి వెళ్లింది. ఈస్టర్న్ డేలైట్ టైమ్ అమెరికా కాలమానం ప్రకారం, 6న సాయంత్రం 7.07 గంటలకు భూమి నుంచి గరిష్ఠంగా 252,757 మైళ్ల దూరానికి వ్యోమనౌక చేరుకుంటుంది. భారత కాలమానం ప్రకారం మంగళవారం తెల్లవారుజామున సుమారు 4.35 గంటల సమయంలో వ్యోమనౌక ఈ గరిష్ఠ దూరానికి చేరుకుంటుంది. దీంతో, ఇది భూమ్మీద నుంచి అత్యధిక దూరానికి చేరిన మానవసహిత యాత్రగా నిలిచిపోతుంది. 1970లో నాసా చేపట్టిన అపోలో-13 మిషన్ కంటే 4,102 మైళ్ల అధిక దూరానికి ఒరాయన్ నౌక చేరుకుంటుంది. ఈ మిషన్‌లో భాగంగా నాసా ఆస్ట్రోనాట్స్ రీడ్ వైస్‌మెన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టీనాతో పాటు కెనడా వ్యోమగామి జెరెమీ హాన్సన్ చంద్రుడి చుట్టూ పరిభ్రమిస్తూ ఫొటోలు తీయనున్నారు. సాధారణంగా జాబిల్లికి చెందిన ఒకవైపు మాత్రమే భూమ్మీద నుంచి కనిపిస్తుంది. భూమ్మీద నుంచి చూడటం సాధ్యం కాని రెండో వైపును ఫార్ సైడ్ అని శాస్త్రవేత్తలు పిలుస్తారు. తాజా మిషన్‌లో ఆస్ట్రోనాట్స్ ఫార్ సైడ్‌న ఉన్న ఉపరితలాన్ని ఫొటోలు తీయనున్నారు. చంద్రుడి చుట్టూ పరిభ్రమిస్తూ ఉపరితలానికి 4 వేల మైళ్ల ఎత్తునుంచి ఈ ఫొటోలు తీసుకున్న అనంతరం భూమివైపు తిరుగుప్రయాణం అవుతారు. భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున ఈ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. మిషన్ అనంతరం ఏప్రిల్ 10న వ్యోమగాములు భూమికి చేరుకుంటారు.

# అధికారుల విధులకు ఆటంకం

## ఎంఐఎం కార్పొరేటర్ మహమ్మద్ గౌస్ కుమారుడి అరెస్ట్

**హైదరాబాద్, ఏప్రిల్ 6:** పాతబస్తీలో చార్మినార్ సమీపంలో ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ఘటనలో ఎంఐఎం కార్పొరేటర్ మహమ్మద్ గౌస్ కుమారుడు మహమ్మద్ సాహిల్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. చార్మినార్ పరిసర ప్రాంతాల్లో ఉన్న అక్రమ ఆక్రమణలను తొలగించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు పోలీసుల బందోబస్తుతో అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో అధికారుల పనిని అడ్డుకున్న సాహిల్, వారితో తీవ్ర వాగ్వాదానికి దిగారు. అక్కడితో ఆగకుండా విధుల్లో ఉన్న పోలీస్ అధికారులను , జీహెచ్ఎంసీ సిబ్బందిని తోసేస్తూ అత్యుత్సాహం ప్రదర్శించారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన చోట, ఒక ప్రజాప్రతినిధి కుమారుడై ఉండి అధికారులపైనే సాహిల్ చేయి చేసుకోవడంపై పోలీసులు సీరియస్ అయ్యారు. అధికారుల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా, పోలీసులను తోసేస్తూ అసభ్యంగా ప్రవర్తించడంతో అక్కడి వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వ అధికారుల పట్ల సాహిల్ ప్రవర్తించిన తీరుపై పోలీసులు తక్షణమే స్పందించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం , అధికారులపై దాడికి ప్రయత్నించినందుకు గాను సాహిల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోంది.

# ఓటర్ జాబితా అప్‌డేట్‌కు గడువు

## సర్ ప్రక్రియపై సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** పశ్చిమ బెంగాల్ ఓటరు లిస్ట్ అప్‌డేట్‌కు సుప్రీం కోర్టు ఒకరోజు గడువు విధించింది. రాష్ట్రంలో నిర్వహించిన ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను పునఃపరిశీలించాలని ప్రత్యేక విస్తృత పునర్విచారణ ట్రైబ్యునల్స్‌ను ఆదేశించింది. ఓటరు లిస్ట్ నుంచి పేర్లను తొలగించడానికి న్యాయాధికారులు ఇచ్చిన కారణాలతో సహా మొత్తం పత్రాలను పరిశీలించి, నిష్పక్షపాతంగా విచారణ జరపాలని సూచించింది. ఓటరు జాబితాలో పేర్ల తొలగింపునకు వ్యతిరేకంగా దాఖలైన అప్పీళ్లను నిర్ణయించేందుకు ట్రైబ్యునళ్లు అనుసరించాల్సిన విధానాలను సూచించేందుకు.. ముగ్గురు మాజీ న్యాయమూర్తులతో ఒక ప్యానల్ ఏర్పాటు చేయాలని కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సుప్రీం ఆదేశించింది. ట్రైబ్యునల్స్ పనితీరుకు సంబంధించిన పరిపాలనాపరమైన అంశాలనూ పర్యవేక్షించాలని సూచించింది. ఓటర్లు ఆన్‌లైన్‌లోనే కాకుండా ఆఫ్‌లైన్‌లోనూ తమ అప్పీళ్లను దాఖలు చేయడానికి వీలుగా రసీదులు జారీ చేయాలని జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయాన్ని ఆదేశించింది. మరోవైపు ఓటర్ల జాబితాలోని పేర్లు తొలగించడం లేదా కొత్త పేర్లను చేర్చడంపై వచ్చే అప్పీళ్లను విచారణ చేయడానికి 19 అప్పీలేట్ ట్రైబ్యునల్స్ ఏర్పాటు చేసినట్లు సుప్రీం కోర్టుకు ఎన్నికల సంఘం తెలియజేసింది

# బోథ్‌లో బాలికపై లైంగికదాడికి యత్నం

## నిందితుడిపై కిడ్నాప్, పోక్సో కేసులు నమోదు

**ఆదిలాబాద్, ఏప్రిల్ 6:** జిల్లాలోని బోథ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలికపై లైంగికదాడికి యత్నించిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. బోథ్‌కు చెందిన ఓ బాలికను నిందితుడు కిడ్నాప్ చేసి, లైంగికదాడికి యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, అతనిపై కిడ్నాప్, లైంగికదాడి, పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి విచారిస్తున్నామని, నిందితుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ స్పష్టం చేశారు. ఈ ఘటన నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని డీఎస్పీ తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు లేదా రాస్తారోకోలు నిర్వహించడం నిషేధించారని చెప్పారు. ఈ ఘటనను పురస్కరించుకుని సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రసంగాలు లేదా విద్వేషపూరిత దుష్ప్రచారం చేసే వారిపై పోలీసులు నిఘా ఉంచారని, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ అశాంతిని సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. "చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరూ సమానమే. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోము. ప్రజలు సామరస్యంతో ఉండాలి, ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించాలి" అని డీఎస్పీ జీవన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అక్రిడిటేషన్లకు లైన్ క్లియర్!

## ఈ నెల 10న రాష్ట్ర స్థాయి కమిటీ భేటీ

## ఏప్రిల్ లోనే కొత్త కార్డుల పంపిణీ

## దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం: ప్రియాంక

**హైదరాబాద్, ఏప్రిల్ 6:** జర్నలిస్టుల అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. అక్రిడిటేషన్ల జారీపై ఇటీవల మీడియాలో వస్తున్న వార్తలను నమ్మి జర్నలిస్టులు ఎవరూ ఆందోళన చెందవద్దని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్రస్థాయిలో ఇప్పటి వరకు అందిన దరఖాస్తులను ఈ నెల 10న జరిగే రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశంలో పరిశీలిస్తారు. అర్హులైన వారికి ఏప్రిల్ లోనే కొత్త కార్డులు అందజేస్తారు. అర్హత గల జర్నలిస్టులు వెంటనే ఆన్ లైన్ ద్వారా తమ దరఖాస్తులను అప్ లోడ్ చేసుకోవాలని ప్రియాంక సూచించారు. అదేవిధంగా జిల్లా స్థాయిలోనూ ఈ నెలలోనే జిల్లా కమిటీ సమావేశాలు నిర్వహించి అక్రిడిటేషన్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. జిల్లా కేంద్రాల్లో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులు వెంటనే తమ దరఖాస్తులను ఆన్ లైన్ లో సమర్పించాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమం దృష్ట్యా ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



# పాతబస్తీని మజ్లిస్‌కు రాసిచ్చారా?

- పోలీసులపై దాడులు చేస్తున్నా చర్యలేవి?
- పాతబస్తీకి ఒక రూల్.. వేరే ప్రాంతాలకు మరో రూలా?
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**హైదరాబాద్, ఏప్రిల్ 6:** పాతబస్తీలో అక్రమ నిర్మాణాల కూల్చివేతకు వెళ్లిన జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసులపై మజ్లిస్ నాయకులు దాడులకు తెగబడటంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం సాయంత్రం పాతబస్తీలోని మురళీధర్ ఆలయాన్ని సందర్శించిన ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. "సీఎం గారూ.. పాతబస్తీని మజ్లిస్ పార్టీకి రాసిచ్చారా? అక్కడ దౌర్జన్యాలు, దోపిడీలు చేసుకోవడానికి ఏమైనా అనుమతి ఇచ్చారా?" అని బండి సంజయ్ ప్రశ్నించారు. హైడ్రా పేరుతో నగరంలోని ఇతర ప్రాంతాల్లో పేదల ఇళ్లను కూలుస్తున్న ప్రభుత్వం, పాతబస్తీలో అధికారులపై దాడులు జరుగుతున్నా కనీసం కేసులు కూడా పెట్టలేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. అక్రమ నిర్మాణాలు కూల్చిన చోటే గంటల వ్యవధిలో మళ్లీ నిర్మాణాలు చేపడుతున్నా ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో హిందువులకు రక్షణ లేకుండా పోయిందని బండి సంజయ్ ఆందోళన వ్యక్తం చేశారు. దేవాలయాలపై దాడులు, గోవధ, లవ్ జీహాద్ వంటి ఘటనలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పక్కనే ఉన్న పాతబస్తీని అభివృద్ధి చేయలేని రేవంత్ రెడ్డి, ఆదిలాబాద్‌ను వేల కోట్లతో అభివృద్ధి చేస్తానంటే ఎవరూ నమ్మరని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నివసిస్తున్న బెంగాలీ కుటుంబాలతో బండి సంజయ్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వం చొరబాటుదారులకు రెడ్ కార్పెట్ పరుస్తూ దేశ భద్రతకు ముప్పు కలిగిస్తోందని విమర్శించారు. రాబోయే బెంగాల్ ఎన్నికల్లో దేశభక్తులకు, దేశద్రోహులకు మధ్య యుద్ధం జరుగుతోందని, అక్కడ ఉన్న తమ బంధుమిత్రులతో మాట్లాడి బీజేపీకి ఓటు వేయించాలని ఇక్కడి బెంగాలీలను కోరారు. పాతబస్తీలో బెంగాలీ కుటుంబాల పిల్లలకు మజ్లిస్ గూండాలు డ్రగ్స్ ఎరవేస్తున్నారని, దీనిని అరికట్టడంలో రేవంత్ సర్కార్ విఫలమైందని మండిపడ్డారు. పాతబస్తీలో అధికారులు, పోలీసులపై జరుగుతున్న దాడులపై సీఎం వెంటనే స్పందించకపోతే పరిస్థితులు అదుపు తప్పే ప్రమాదం ఉందని బండి సంజయ్ హెచ్చరించారు.

# గజ్వేల్ బంద్ సక్సెస్

- రోడ్డెక్కిన బీఆర్ఎస్ శ్రేణులు
- డిపోలకే బస్సులు.. మూతపడ్డ షాపులు
- ప్రతిపక్షాలపై దాడులు ఆపాలని డిమాండ్



**గజ్వేల్, ఏప్రిల్ 6:** గజ్వేల్ ఎమ్మెల్యే అధికారిక క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడికి నిరసనగా నియోజకవర్గంలో బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. బీఆర్ఎస్ శ్రేణుల పిలుపు మేరకు గజ్వేల్, ప్రజ్ఞాపూర్ ప్రాంతాల్లో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. ఆర్టీసీ బస్సులన్నీ డిపోలకే పరిమితం కావడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో ముందు బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఎత్తున బైఠాయించి నిరసన తెలిపారు. బంద్‌లో పాల్గొన్న నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుపై దాడి చేయడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. ఈ దాడుల సమాచారం ఇంటెలిజెన్స్ విభాగానికి ముందే ఉందా లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలని, అవి మరిచి ప్రతిపక్షాలపై దాడులకు తెగబడటం సరికాదని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు తమ ఆఫీసుల్లో మోదీ ఫోటో పెట్టారా అని నిలదీశారు. బీజేపీ ఎమ్మెల్యేల ఆఫీసుల్లో సీఎం ఫోటో పెట్టారా అని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేసీఆర్ నాయకత్వంలో ఇలాంటి దాడులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

# బంజారాలకు పార్టీలో సముచిత గౌరవం.. కవిత హామీ

**హైదరాబాద్, ఏప్రిల్ 6:** ఈ నెల 25న కొత్త రాజకీయ పార్టీని ప్రకటించబోతున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన వ్యూహాలకు పదును పెడుతున్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నంలో భాగంగా ఆమె వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల సింగరేణి కార్మికులతో సమావేశమైన కవిత.. సోమవారం బంజారా నేతలతో భేటీ అయ్యారు. రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్ సహా పలువురు బంజారా ప్రముఖులతో ఆమె చర్చలు జరిపారు. హైదరాబాద్‌లోని డీటీ నాయక్ నివాసానికి వెళ్లిన కవిత.. తన కొత్త రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. బంజారా సమాజం అభివృద్ధి కోసం పార్టీ పరంగా ఏం చేయాలో కూలంకషంగా చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం బంజారాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడంపై కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తమ పార్టీలో ఈ సామాజిక వర్గానికి సముచిత గౌరవం, అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. బంజారా ప్రముఖులు తన పార్టీకి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కవిత విజ్ఞప్తి చేశారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలనుకునే బంజారా నేతలను తమ పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. వరుసగా వివిధ వర్గాల ప్రముఖులను కలుస్తుండటంతో కవిత కొత్త పార్టీపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ భేటీ ద్వారా బంజారా ఓటు బ్యాంకును ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది.



# బెంగళూరులో ఐడియా అవార్డ్స్.. ముఖ్యఅతిథిగా కేటీఆర్

## ఏప్రిల్ 16న ప్రతిష్టాత్మక అవార్డుల ప్రదానోత్సవం

## దేశవ్యాప్త పారిశ్రామికవేత్తల సమక్షంలో ప్రసంగం



**హైదరాబాద్, ఏప్రిల్ 6 :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అరుదైన ఆహ్వానం లభించింది. బెంగళూరు వేదికగా అత్యంత వైభవంగా జరగనున్న 'ఎంటర్ ప్రే న్యూర్ ఇండియా ఐడియా అవార్డ్ 2026' వేడుకకు ఆయనను ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. నవకల్పనలు, పారిశ్రామిక వృద్ధికి కేటీఆర్ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. వచ్చే ఏప్రిల్ 16వ తేదీన బెంగళూరు వైట్ ఫీల్డ్‌లోని షెరటన్ గ్రాండ్ హోటల్‌లో ఈ ప్రతిష్టాత్మక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మెగా ఈవెంట్‌లో దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 300 మందికి పైగా అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తలు, ఇన్వెస్టర్లు, అంకుర సంస్థల (స్టార్టప్) వ్యవస్థాపకులు, వ్యాపార రంగ నిపుణులు ఒకే వేదికపైకి రానున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్న దార్శనిక నాయకులను ఈ సందర్భంగా సత్కరించనున్నారు. సాంకేతికత, ఆవిష్కరణలు, ఆర్థికాభివృద్ధి రంగాల్లో కేటీఆర్ చూపిన డైనమిక్ నాయకత్వాన్ని నిర్వాహకులు కొనియాడారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా కేటీఆర్ హయాంలో తీసుకువచ్చిన ప్రగతిశీల విధానాలు, స్టార్టప్ ఎకోసిస్టమ్ అభివృద్ధి, పారిశ్రామిక వృద్ధి దేశవ్యాప్తంగా ఎంతోమంది యువ పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తినిచ్చాయని ఆహ్వాన పత్రంలో పేర్కొన్నారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
మంగళవారం
7 ఏప్రిల్ 2026



సంపాదకీయం

# సహజవాయువు కోసం ఉద్యమించాల్సిందే!

పశ్చిమాసియా యుద్ధం వల్ల ఇంధనం, గ్యాస్ సమస్యలు తీవ్రం అవుతున్నాయి. ప్రధానంగా గ్యాస్ సమస్య తీవ్రత పెరుగుతోంది. ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియడం లేదు. ట్రంప్ బెదిరింపులు, హుంకరింపులతో సమస్య మరింత జటిలం అవుతోంది. ఇరాన్ కూడా తగ్గేది లేదన్నట్లుగా పోరాడుతోంది. అమెరికా యుద్ధ విమానాలను కూల్చేస్తోంది. 48 గంటల గడువు ముగిసిన వేళ, నియంత ట్రంప్ ఏ దుర్మార్గాలకు ఒడిగడతాడో తెలియడం లేదు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో రాష్ట్రం తీవ్ర గ్యాస్ కొరతను ఎదుర్కొంటోంది. సాధారణ ప్రజలు, చిరు వ్యాపారులు హోటల్ నిర్వాహకులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని తినుబండారాల ధరలు పెరుగుతున్నాయి. 5 రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచుతుందన్న ప్రచారం కూడా సాగుతోంది. అదే జరిగితే నిత్యావసరాల ధరలు మిన్నంటే ప్రమాదం వుంది. మరోవైపు సహజవాయువు కేటాయింపులు లేక రాష్ట్రంలో గ్యాస్ ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రాలు మూతబడిన దుస్థితి ఏర్పడింది. ఫలితంగా అధిక రేటుకు డిస్కంలు విద్యుత్ కొనాల్సివస్తోంది. ఈ క్రమంలో దేశీయంగా సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పటికే గ్యాస్ కొరతతో ప్రజలు అగచాట్లు పడుతున్నారు. హోటల్ పరిశ్రమ కుదేలవుతోంది. కట్టెల పొయ్యి లతో కొన్నిచోట్ల నెట్టుకు వస్తున్నారు. విద్యుత్ స్టవ్‌ల ఉత్పత్తి పెరిగింది. అయితే తగినంత విద్యుత్ సరఫరా కూడా కష్టంగానే ఉంది. ఎండాకాలం కావడంతో అడపాదడపా కరెంట్ కష్టాలు మొదలు అయ్యాయి. ఈ క్రమంలో కృష్ణా-గోదావరి బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే చమురు, సహజ వాయువు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇక్కడి సహజవాయువును గృహ, హోటల్ అవసరాలకు మళ్లించాలి. అప్పుడు డిమాండ్‌లో కనీసం 50 శాతం అయినా అధిగమించగలం. ఒక రకంగా చెప్పాలంటే ఇది ఉభయ తెలుగు రాష్ట్రాల హక్కు. ఇక్కడి వనరులు వీరికే దక్కాలి. ఈ సహజవాయువులో కనీసం సగం ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాలని సీపీఎం అధ్వర్యంలో వామపక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాలు, సంస్థలకు చెందినవారు డిమాండ్ చేస్తున్నారు. వీరి డిమాండ్ కూడా న్యాయంగా ఉన్నదే. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇదే డిమాండ్‌తో జనవిజ్ఞాన వేదికవంటి వివిధ సంస్థలు అనేక రూపాల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాయి. అయితే ఆ తరువాత ఉమ్మడి రాష్ట్ర విభజన కోరుతూ ఆందోళనలు, ఇతరేతర కారణాలతో అది వెనక్కు వెళ్లింది. ఈ గ్యాస్ వల్ల ఎపి ఆర్థిక వ్యస్థ కూడా బలపడుతుంది. ప్రజల సమస్యలు తీరుతాయి. దీనిపై చంద్రబాబు పట్టుబట్టాల్సిన తరుణం ఇది. అయితే కార్పోరేట్ దిగ్గజాల చేతిలో ఉన్న ఈ వ్యవహారం విషయంలో చంద్రబాబు అంత తొందరగా నోరువిప్పుతారని అనుకోరాదు. డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కూడ రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి పెట్టాలి. ఇక్కడ లభించే గ్యాస్ ఇక్కడి ప్రజలకు సరఫరా చేస్తే... రాష్ట్ర ప్రజలకు ఎంతగానో ఉపయోగపడగలదు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కూడా ఆదాయం సమకూరుతుంది. ఈ విషయంలో స్థానిక ప్రజలే ఉద్యమాలు చేపట్టాల్సి ఉంది. బ్లో అవుట్‌లతో బాధలు పడుతున్న ప్రజలు, గ్యాస్ వల్ల లాభాలు కూడా పొందాలి. మన గ్యాస్ మనకే అని ఉద్యమించాలి. ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన కృష్ణా-గోదావరి డి6 బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును రోజుకు 21 వేల టన్నులు ఉత్పత్తి అవుతోందని అంచనా. రిలయన్స్ కంపెనీ పైపులైన్లు ద్వారా ఇక్కడ నుండి మహారాష్ట్ర, గుజరాత్‌కు గ్యాస్ సరఫరా చేసుకుని అక్కడ పరిశ్రమలు, ఇతర అవసరాలకు విక్రయించి వేల కోట్ల రూపాయల లాభాలు సంపాదిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో వంట గ్యాస్ వినియోగం రోజుకు నాలుగు వేల టన్నులు. ఆయిల్ డ్రిల్లింగ్, ఇతర కార్యకలాపాలతో నిత్య కాలుష్యమేగాక బ్లో అవుట్‌లు, ఇతర ప్రమాదాల్లో రాష్ట్రం విలువైన ప్రాణాలను కోల్పోతున్నది. అత్యంత విలువైన సహజ వనరులను రాష్ట్రం కోల్పోతోంది. కనుక నష్టాలు రాష్ట్రానికి, లాభాలు రిలయన్స్‌కు చెందడం సరికాదు. ఇక్కడి సహజ వాయువును కనీసం 50శాతం ఇక్కడి ప్రాంత ప్రజలకు కేటాయించిన తరవాతనే మిగతాది తరలించడం న్యాయం. మన తీరంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్ రాష్ట్రానికి కేటాయిస్తే కరెంటు కష్టాలు కూడా తగ్గుతాయి. కాబట్టి రాష్ట్రంలో లభించే ప్రకృతి వనరులను సరిగా వినియోగించు కుంటే ఇలాంటి ఇబ్బందులు రావు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌లో మన వాటా మనకు వస్తే రూ.950 ఉన్న సిలిండర్ ధర రూ.300- 350కు, యూనిట్ కరెంటు రూపాయికి వచ్చే అవకాశం ఏర్పడుతుంది. పిఎన్‌జి ఇంకా తక్కువ ధరకే లభిస్తుంది. చమురు, సహజ వాయువు జాతీయ సంపద కనుక రాష్ట్రానికి ఇవ్వాల్సిన న్యాయమైన వాటా ఇచ్చి మిగిలినది ఇతర రాష్ట్రాలకు తీసుకెళితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. మన సహజ వనరులను రిలయన్స్‌కు అప్పగించి, మనం ఇబ్బంది పడటం అన్యాయం. కెజి బేసిన్‌లో చట్టబద్ధంగా రావాల్సిన చమురు, సహజవాయువు వాటాను పొందేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలి. అవసరమైతే అసెంబ్లీ తీర్మానించాలి. ఈ విషయంలో అఖిలపక్షంలో చర్చించాలి. గతంలోకి వెళితే కృష్ణా-గోదావరి డి6 బేసిన్ ను రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు 20 ఏళ్ల క్రితం అప్పుడున్న ప్రభుత్వాలు చట్టవిరుద్ధం గా కేటాయించాయి. భూగర్భ నిక్షేపాలను కనుగొన్నపుడు లభించే ఉత్పత్తుల్లో ఆయా కంపెనీలు కేంద్ర ప్రభుత్వానికి వాటాగా సరఫరా చేసే చమురు, సహజవాయువులో 50 శాతాన్ని సంబంధిత రాష్ట్రాలకు కేటాయించాలని 12వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కూడా ఈ విషయాన్ని గురించి పెట్రోలియం మంత్రిత్వ శాఖను నిలదీసింది. కనుక ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరంలో ఉత్పత్తి అవుతున్న కృష్ణా-గోదావరి బేసిన్ సహజ వాయువులో సగం రాష్ట్ర అవసరాలకు కేటాయించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. దీనిని చంద్రబాబు లేవనెత్తడం మంచిది. కేంద్రంలో అధికారం పంచుకుంటున్న చంద్రబాబు ఈ విషయంలో ఇప్పటికైనా డిమాండ్ ముందుకు తీసుకుని రావాలి. రాష్ట్రాలకు రాజ్యాంగ బద్ధంగా ఇవ్వాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం ఎలాగూ ఇవ్వడం లేదు. విభజన సమస్యలు అలాగే ఉన్నాయి. అయితే చంద్రబాబు కోరిన వెంటనే ఇప్పుడు పనులు జరుగుతున్నాయి. అందువల్ల సహజ వాయువు విషయంలో ఒత్తిడి పెంచితే కేంద్రం దిగిరాక తప్పదు. ప్రజలు కూడా ఆందోళనలకు దిగితే తప్ప రాష్ట్రానికి చురుకు పుట్టదు.

# కోల్‌కతాపై పాక్ మంత్రి సంచలన వ్యాఖ్యలు

- భారత భద్రతా ఏజెన్సీలు హై అలర్ట్
- ఎన్నికల వేళ ఉగ్ర కుట్రలపై నిఘా
- 'ఆపరేషన్ సిందూర్' తరహాలోనే బుద్ధి చెబుతామని హెచ్చరిక




**న్యూఢిల్లీ/కోల్‌కతా, ఏప్రిల్ 6:** భారత్‌లో ఏదైనా 'ఫాల్స్ ఫ్లాగ్ ఆపరేషన్' జరిగితే, దానికి ప్రతికారంగా కోల్‌కతాను టార్గెట్ చేస్తామంటూ పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు అంతర్జాతీయంగా కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత భద్రతా ఏజెన్సీలు అత్యంత అప్రమత్తమయ్యాయి. పాక్ మంత్రి వ్యాఖ్యల వెనుక ఉన్న లోతైన కుట్రలను అధికారులు విశ్లేషిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను దృష్టిలో ఉంచుకునే పాక్ మంత్రి కోల్‌కతాను ప్రస్తావించారని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. హర్కత్-ఉల్-జిహాద్ ఇస్లామీ (హుజీ), జమాత్-ఉల్ ముజాహిదీన్ బంగ్లాదేశ్ (జేఎంబీ) వంటి ఉగ్రవాద సంస్థలను రెచ్చగొట్టి, బెంగాల్ మరియు అసోం రాష్ట్రాల్లో దాడులకు పాల్పడే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ సమాచారం అందింది. ఎన్నికల వాతావరణాన్ని చెడగొట్టడమే పాక్ ప్రధాన ఉద్దేశమని అధికారులు అనుమానిస్తున్నారు. భారత్, బంగ్లాదేశ్ మధ్య రోజురోజుకూ బలపడుతున్న ఆర్థిక, భద్రతా సంబంధాలు పాకిస్థాన్‌కు కంటగింపుగా మారాయి. ఈ రెండు దేశాల మధ్య చిచ్చు పెట్టేందుకు పశ్చిమ బెంగాల్ లేదా ఈశాన్య రాష్ట్రాల్లో ఉగ్ర దాడులు చేయించి, ఆ ప్రాంతాల్లో అస్థిరత సృష్టించాలని పాక్ ఐఎస్ఐ వ్యూహాలు పన్నుతోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. పాకిస్థాన్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా గతంలో చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' తరహాలోనే అత్యంత కఠినంగా బదులిస్తామని భారత ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. "సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తే, దానిని యుద్ధ చర్యగానే పరిగణిస్తాం. ఉగ్ర స్థావరాలను పూర్తిగా మూసివేస్తే తప్ప చర్చల ప్రసక్తే లేదు" అని భారత్ తేల్చిచెప్పింది. భారత సైన్యం దాడులతో నిర్వీర్యమైన ఉగ్రవాద సంస్థల్లో నైతిక స్థైర్యం నింపేందుకు, కొత్త ఉగ్రవాదులను రిక్రూట్ చేసుకునేందుకే పాక్ మంత్రులు ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతానికి కోల్‌కతా సహా సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# ఇరాన్‌కు మరో కోలుకోలేని దెబ్బ

- ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఖదేమీ మృతి
- అమెరికా, ఇజ్రాయెల్ దళాల వైమానిక దాడిలో హతం
- ఫిబ్రవరి నుంచి కూలుతున్న ఇరాన్ అగ్రనేతలు




**టెహ్రాన్/వాషింగ్టన్, ఏప్రిల్ 6:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఇరాన్‌కు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా, ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా జరిపిన వైమానిక దాడిలో ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఇంటెలిజెన్స్ చీఫ్, మేజర్ జనరల్ సయ్యద్ మజీద్ ఖదేమీ మరణించారు. సోమవారం తెల్లవారుజామున ఈ దాడి జరిగినట్లు ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ ఘటనపై ఐఆర్‌జీసీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇది నేరపూరిత ఉగ్రవాద దాడి అని, ఈ దాడిలో ఖదేమీ 'షహీద్' (అమరుడు) అయ్యారని పేర్కొంది. అయితే, దాడి ఎక్కడ జరిగిందనే ప్రదేశాన్ని మాత్రం ఐఆర్‌జీసీ వెల్లడించలేదు. ఇరాన్ భద్రతా వ్యవస్థలో అత్యంత శక్తివంతమైన నిఘా విభాగానికి ఖదేమీ నాయకత్వం వహిస్తున్నారు. ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి జరుగుతున్న దాడుల్లో ఇరాన్ అనేక మంది ఉన్నతాధికారులను కోల్పోయింది. గత నెలలోనే ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ, ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్‌లను ఇజ్రాయెల్ దళాలు హతమార్చాయి. అంతకుముందు ఐఆర్‌జీసీ చీఫ్ మహమ్మద్ పక్‌పూర్, బసీజ్ ఫోర్స్ చీఫ్ ఘోలామ్‌రెజా సొలైమానీ వంటి కీలక నేతలు కూడా ఈ దాడుల్లో మరణించారు. ఫిబ్రవరి 28న జరిగిన తొలి దాడిలోనే ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీ మరణించడం తెలిసిందే. ప్రస్తుతం ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన్ను కూడా లక్ష్యంగా చేసుకుంటామని అమెరికా, ఇజ్రాయెల్ హెచ్చరించింది.




# సిర్పూర్ పీఎంశ్రీ నిధుల్లో 'సదాశివుడి' లీలలు?!

- సర్కారు సొమ్ము భార్య ఖాతాలోకి..!
- పీఎం శ్రీ నిధుల దుర్వినియోగం పై ఫిర్యాదు
- దొంగ బిల్లులతో లక్షల రూపాయల మళ్లింపు..!
- సిర్పూర్ టీ హెచ్ఎం పై ఆరోపణల వెల్లువ
- ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్..!
- సొంత ఖాతాలకు నిధుల మళ్లింపు...!
- విచారణకు డిమాండ్




**ఉద్యమ కెరటం, ప్రత్యేక ప్రతినిధి :** సర్కారు బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు కేంద్రం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'పీఎంశ్రీ' నిధులు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టీ) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పక్కదారి పట్టాయి అని ఆరోపణాలు వినిపిస్తున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి, తన అధికార బలంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తు నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు మాజీ ఎంపీటీసీ దుర్గం విక్రం ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు.

## కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి నిధులు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాల అభివృద్ధికి వెచ్చించాల్సిన నిధులను హెచ్ఎం తన సొంత ప్రయోజనాల కోసం వాడుకున్నట్లు విక్రం ఆరోపించారు. హెచ్ ఎం తన భార్య ఖాతాలోకి ₹3,91,980 మళ్ళించారని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఖాతాలోకి ₹2,31,000, జూనియర్ అసిస్టెంట్ ఖాతాలోకి ₹2,37,250 బదిలీ చేశారు. మరో ఇద్దరు టీచర్లు తన ఇంటి ఓనర్ ఖాతాల్లోకి వేల రూపాయలు బదిలీ చేసి, తిరిగి ఫోన్‌పే ద్వారా తన వ్యక్తిగత ఖాతాకు జమ చేసుకున్నట్లు ఫిర్యా దులో పేర్కొన్నారు.

## దొంగ బిల్లులు.. జీఎస్టీ లేని వెండర్లు...!

పాఠశాలలో పనులు జరిగినట్లు చూపేందుకు సృష్టించిన వోచర్లు విస్తుగొలుపుతున్నాయి. ఒక స్వీట్ షాప్ పేరిట ₹70 వేలకు పైగా బిల్లులు పెట్టారు. చాయ్ అమ్మని షాపులో టీ తాగినట్లు దొంగ బిల్లులు సృష్టించడం గమనార్హం. జిరాక్స్ పేరిట ₹33,450 బిల్లు పెట్టగా, ఆ యజమాని అసలు తానేమీ అమ్మలేదని చెప్పడం అవినీతికి అద్దం పడుతోందనీ విక్రమ్ అన్నారు. దాతలు ఇచ్చిన కుర్చీలు, ఫ్యాన్లు, అల్మారాలను తానే కొన్నట్లు తప్పుడు స్టాక్ రిజిస్టర్ సృష్టించి నిధులు స్వాహా చేశారనీ ఆరోపణలు ఉన్నాయి. పాత గేట్లకే రంగు వేసి, రెండు కొత్త గేట్లు చేయించామని తప్పుడు బిల్లులు సమర్పించారు.

## టీచర్లను వేధించి వసూళ్లు...!

కొత్తగా నియమితులైన ఖాజ టీచర్ల నుండి సాలరీ బిల్లుల కోసం ఒక్కొక్కరి నుండి ₹3,500 వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే రిటైర్డ్ మహిళా టీచర్ల బెనిఫిట్స్ కోసం లంచాలు డిమాండ్ చేసినట్లు సమాచారం. పాఠశాలలో విద్యార్థులకు అందజేయాల్సిన 'రాగి జావా' ప్యాకెట్లను పంపిణీ చేయకుండా గదిలోనే మగ్గిపోయేలా చేశారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## నిర్లక్ష్యానికి పరాకాష్ట..!

ఓ వైపు లక్షల రూపాయల నిధులు కాజేస్తూ, మరోవైపు పాఠశాల మౌలిక సదుపాయాలను గాలికొదిలేశారు. 7వ తరగతి గదుల్లో ఫ్లోరింగ్ లేక ఇసుకలో కూర్చునే పరిస్థితి, విద్యార్థులకు సరిపడా టాయిలెట్లు లేకపోవడం, తాగేందుకు కేవలం మూడు ట్యాపులు మాత్రమే ఉండటం హెచ్ఎం నిర్లక్ష్యానికి నిదర్శనం. చివరికి పరీక్షల సమయంలో హాల్ టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధించడంతో కలెక్టర్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

## సమగ్ర విచారణకు డిమాండ్

ఈ భారీ కుంభకోణంపై పూర్తిస్థాయి ఆడిట్ నిర్వహించాలని, ఫోన్ పే లావాదేవీలను పరిశీలించాలని మాజీ ఎంపీటీసీ దుర్గం విక్రం డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, ప్రభుత్వ నిధులను రక్షించాలని అడిషనల్ కలెక్టర్‌ను కోరారు.



# ఇరాన్‌పై భీకర వైమానిక దాడులు

## 13 మంది దుర్మరణం

**టెహ్రాన్/వాషింగ్టన్, ఏప్రిల్ 6 :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తార స్థాయిని చేరుకున్నాయి. యూఎస్ మిలిటరీ స్థావరాలు, మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఇటీవల ఇరాన్ కొన్ని దాడులు చేసింది. వాటికి ప్రతీకారంగా సోమవారం తెల్లవారుజామున ఇరాన్‌పై భీకర వైమానిక దాడులు జరిగాయి. అమెరికా- ఇజ్రాయెల్ సంయుక్తంగా ఈ దాడులు చేసినట్టు తెలుస్తోంది. నిర్దేశించిన గడువులోగా హర్మూజ్ జలసంధిని నౌకల రాకపోకలకు వీలుగా తెరవకపోతే ఇరాన్‌లో వంతెనలు, విద్యుదుత్పత్తి కర్మాగారాలను నామ-రూపాల్లేకుండా చేస్తామని, నరకం చూపిస్తామని ఇటీవల టెహ్రాన్‌ను ట్రంప్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఈ క్రమంలోనే ఇరాన్‌పై దాడులు జరగడం గమనార్హం. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని పాలక భవనాలే లక్ష్యంగా క్షిపణులు దూసుకొస్తున్నాయి. ఈ క్రమంలోనే 13 మంది మృతి చెందడంతో పాటు పలువురికి గాయాలైనట్టు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. రాజధానిలోని షరీఫ్ యూనివర్సిటీపై వైమానిక దాడులు జరిగాయి. ఈ ఘటనలో క్యాంపస్ భవనం తీవ్రంగా దెబ్బతినడంతో పాటు పరిసరాల్లోని సహజవాయువు సరఫరా చేసే పైప్‌లైన్ ధ్వంసమయ్యింది. యుద్ధం కారణంగా విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాస్‌లు నిర్వహించాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. దాడులు జరిగిన సమయంలో క్యాంపస్‌లో ఎవరూ లేరని, దీంతో ప్రాణాపాయం తప్పిందని స్థానిక మీడియా తెలిపింది. "దేశ ప్రజలను లక్ష్యంగా చేసుకొని శత్రువులు దాడి చేస్తున్నారు. మా పౌరులను టార్గెట్ చేస్తే ప్రతీకారం తీవ్రస్థాయిలో ఉంటుంది. అందరూ అప్రమత్తంగా ఉండండి" అంటూ ఇరాన్ సెంట్రల్ మిలిటరీ కమాండ్ హెచ్చరికలు జారీ చేసింది. "అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట మీద నిలబడే వ్యక్తి కాదు. ఏ సమయంలో ఏం చేస్తారో తెలియదు. ఆయన ప్రవర్తన గురించి ఇరానియన్లు, అమెరికన్లు ఎవరూ అంచనా వేయలేరు. హర్మూజ్ జలసంధిని మొత్తం ప్రపంచం కోసం తెరిచి ఉంచినా ఇరాన్ శత్రువులకు మాత్రం మూసే ఉంటుంది" అని దేశ సాంస్కృతిక మంత్రి రెజా సాల్హీ అమిరీ పేర్కొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బెజ్జూర్ తాజా మాజీ ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా తెలంగాణ జావిద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని స్థానిక తహశీల్దార్ రామ్మోహన్ రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎండాకాలంలో బాటసారులు, వాహనదారులు, తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతిరోజూ పరిశుభ్రమైన చల్లటి మంచినీటిని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పారిశుధ్యానికి ప్రత్యేక చర్యలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ (ఇచ్చోడ):** గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఇచ్చోడ మండలంలోని సాత్ నంబర్ గ్రామ సర్పంచ్ రమేష్ రాథోడ్ తెలిపారు. సోమవారం గ్రామంలోని మురికి కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించి శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయవద్దన తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షబ్బీర్, గ్రామ కార్యదర్శి, గ్రామ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఆకుల రాజశేఖర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధిలో భారతీయ జనతా పార్టీ పోషిస్తున్న కీలక పాత్రను కొనియాడారు. అనంతరం బీజేపీ జిల్లా కార్యదర్శి గాదె శంకర్, జిల్లా మాజీ ఓబీసీ మోర్చా కార్యదర్శి గట్టు నారాయణ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో మండల ఉపాధ్యక్షుడు అడెపు రమేష్, మండల ప్రధాన కార్యదర్శులు రాజేశ్వర్, రంజిత్, నాయకులు బక్రే శంకర్, కోటేష్, పరుశురాం, శ్రీధర్ రెడ్డి, ఉత్తమ్ సింగ్, మాజీ ఎంపీటీసీ దురువ రాజు తదితరులు పాల్గొని పార్టీ ఆశయాల సాధనకు కట్టు బడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

## గుండాల గ్రామంలో వైద్య శిబిరం



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీడీ, క్యాన్సర్ కేర్ ఫేజ్–2 కింద తిర్యాణి మండలంలోని గుండాల గ్రామపంచాయతీ పరిధిలోని గుండాల సబ్ సెంటర్‌లో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ స్క్రీనింగ్‌తో పాటు చెవి, ముక్కు, గొంతు, కంటి, దంత సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించి గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పల్లవి, డా. యశ్వంత్, అనూష, భారతి, సుశీల, కాంతాలీలా, హెచ్ఈఓ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పల్లవి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామస్థులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ముఖ్య లక్ష్యమని తెలిపారు. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించడం ద్వారా ఆరోగ్య సమస్యలను తగ్గించవచ్చని చెప్పారు. గ్రామ ప్రజలు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి

- ముందస్తు అడ్మిషన్లు, సమ్మర్ క్లాసులు అరికట్టాలి
- ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున




**ఉద్యమ కెరటం, నల్గొండ:** రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పెరుగుతున్న ఫీజులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని ఫీజు నియంత్రణ చట్టాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు పోతుగంటి కాశి అధ్యక్షతన మిర్యాలగూడలోని జ్యోతిరావు పూలే భవన్‌లో సోమవారం నల్గొండ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల విషయంలో తీవ్ర అవ్యవస్థ నెలకొందన్నారు. ప్రభుత్వం ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఆచరణలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని విమర్శించారు. ఫీజు నియంత్రణ చట్టం డ్రాఫ్ట్‌ను ప్రజల అభిప్రాయాల కోసం విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అది ఇప్పటికీ వెలువడకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. స్కూళ్ల బేస్ ఫీజును ఖరారు చేయడానికి అవసరమైన డేటా సేకరణలో కూడా జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఫీజులను భారీగా పెంచుతూ, యూనిఫార్ములు, పుస్తకాలు పేరుతో అదనపు వసూళ్లు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు నియంత్రణ చట్టం డ్రాఫ్ట్‌ను వెంటనే ప్రజల ముందుకు తీసుకురావాలని, స్కూళ్ల బేస్ ఫీజును పారదర్శకంగా నిర్ణయించాలని, ప్రైవేట్ పాఠశాలలపై కఠిన నియంత్రణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే అనవసర వసూళ్లను నిలిపివేసి జిల్లా స్థాయిలో ఫీజు నియంత్రణ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలలకు ఏప్రిల్ 1 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు ప్రకటించినప్పటికీ కొంత మంది కళాశాలలు ప్రభుత్వ నియమాలను ఉల్లంఘించి ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటూ సమ్మర్ క్లాసులు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఇలాంటి కళాశాలలపై చర్యలు తీసుకుని వారి అనుమతులను రద్దు చేయాలని ఇంటర్మీడియట్ కమిషనర్‌ను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వస్కుల భరత్, జిల్లా కమిటీ సభ్యులు ఇమాన్యువల్, సందీప్, కిరణ్, మధు, రాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సభకు అడ్డుకుంటామని హెచ్చరిక

- మాజీ సర్పంచులు, వీటిడిఏ చైర్మన్ అరెస్ట్



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మాజీ సర్పంచులు చేపట్టిన గ్రామ అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపిస్తూ బజార్‌హత్నూర్ మండలంలోని పిప్పిరి గ్రామ శివారంలో సోమవారం జరగనున్న ముఖ్యమంత్రి సభను అడ్డుకుంటామని హెచ్చరించిన నేపథ్యంలో పలువురు మాజీ సర్పంచులు, వీటిడిఏ చైర్మన్‌ను నేరడిగొండ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నియంతపాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ సమస్యలను వెల్లడించాలన్నా ప్రభుత్వం అడ్డుకుంటోందని వీటిడిఏ చైర్మన్ మహేందర్ జాధవ్ మండిపడ్డారు. మాజీ సర్పంచులు చేపట్టిన అనేక గ్రామాభివృద్ధి పనుల బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉండడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం ఎదురు చూస్తున్న మాజీ సర్పంచులను పట్టించుకునే పరిస్థితి లేదని, ప్రభుత్వాలు ఇచ్చే హామీలు అమలు కాకపోవడంతో రాజకీయ, పాలనా వ్యవస్థలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఆవేదనను వ్యక్తపర్చడానికి కూడా అవకాశం ఇవ్వకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని, సమస్య పరిష్కారం అయ్యే వరకు వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. అరెస్టు అయిన వారిలో లఖంపూర్ మాజీ సర్పంచ్ కొమురం జంగు, కిష్టాపూర్ మాజీ సర్పంచ్ సోలంకి గీత కరణ్ సింగ్, రోల్ మామాడ మాజీ సర్పంచ్ హంస బాయి యాదవ్, బుద్ధికొండ మాజీ సర్పంచ్ గంగామణి తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి పనుల్లో రాజీ లేదు





ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**ఉద్యమ కెరటం, వరంగల్:** అభివృద్ధి పనుల్లో రాజీ లేదని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 54వ డివిజన్ పరిధిలోని అపూర్వ కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ఈ పనులను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మాటలకే పరిమితం కాకుండా పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. గత పాలకుల హయాంలో శంకుస్థాపనలు చేసి పనులు నిలిపివేసే పరిస్థితులు ఉండేవని విమర్శించారు. అపూర్వ కాలనీ అభివృద్ధికి గతంలో కూడా కొంత నిధులు కేటాయించామని గుర్తు చేశారు. ప్రతి కాలనీ అభివృద్ధే తన లక్ష్యమని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో అభివృద్ధి పనులు పూర్తి చేసి మార్పు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. గత పదేళ్లలో ఈ ప్రాంతం వెనుకబాటుతనానికి గురైందని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్లలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసి మళ్లీ ఎన్నికల సమయంలో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం పనులు పూర్తి చేస్తేనే ఓటు అడుగుతామని స్పష్టం చేశారు. ప్రతిరోజు ఉదయం నియోజకవర్గంలో జరుగుతున్న, జరగాల్సిన, జరగబోయే అభివృద్ధి పనులపై సమీక్షలు నిర్వహిస్తూ రోజుకు కనీసం రెండు డివిజన్లలో పర్యటిస్తున్నామని తెలిపారు. గత రెండేళ్లలో ప్రధాన సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి గణనీయమైన పురోగతి సాధించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే నాగరాజు



**ఉద్యమ కెరటం, వరంగల్:** రైతుల సంక్షేమమే లక్ష్యమని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కెఆర్ నాగరాజు అన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో, ఏనుగల్లు గ్రామంలో మార్క్‌ఫెడ్ సహకారంతో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పంటలకు సరైన ధర లభించేలా ప్రభుత్వం ముందస్తుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రైతుల పట్ల సానుకూల దృక్పథంతో పనిచేస్తోందని అన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించాలని సూచించారు. ఈ కేంద్రాల్లో మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ.24వేల కనీస మద్దతు ధర లభిస్తుందని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి అనుమానాలు లేకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తమ పంటను తీసుకురావాలని చెప్పారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పంట తూకం, చెల్లింపులు తదితర ప్రక్రియలు పారదర్శకంగా, వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, పంటలకు సరైన ధర కల్పించడం ద్వారా రైతు కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపర్చడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మార్క్‌ఫెడ్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులను కమిషన్ల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు

- ఏఎంసీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి



**ఉద్యమ కెరటం, వరంగల్:** రైతులను కమిషన్ల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని ఏఎంసీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. మామిడి పండ్ల సీజన్ నేపథ్యంలో సోమవారం ఉదయం బాటసింగారం పండ్ల మార్కెట్‌ను సందర్శించి మామిడి క్రయవిక్రయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది బాటసింగారం పండ్ల మార్కెట్‌లో సుమారు 1,40,000 మెట్రిక్ టన్నుల మామిడి దిగుబడి వచ్చిందని తెలిపారు. ఈ ఏడాది మరింత అధిక మొత్తంలో మామిడి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని చెప్పారు. మామిడి సీజన్ సందర్భంగా రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులకు మామిడి పండ్లకు మంచి ధర లభిస్తున్నదని తెలిపారు. కమిషన్ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేసినా, వారికి రావాల్సిన బకాయిలు ఇవ్వకపోయినా సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పండ్లను పండించేందుకు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతించిన ఇతనాల్‌ను మాత్రమే వినియోగించాలని సూచించారు. అధికంగా రసాయనాలు ఉపయోగించినట్లు తేలితే సంబంధిత వ్యాపారుల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. మార్కెట్ పరిస్థితులను ప్రతి వారం పరిశీలిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తూ నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ బాస్కర చారి, సభ్యులు బండి మధుసూదన్ రావు, మచ్చెందర్ రెడ్డి, గణేశ్ నాయక్, నరసింహా, రఘుపతి రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, అంజయ్య, వెంకటేశ్వర్లు గుప్తా, ఇబ్రహీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్ శ్రీనివాస్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఉద్యమ కెరటం, వరంగల్:** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని దామెర మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్ కుమార్ పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాలకు భద్రాద్రి కొత్తగూడెంలో జిల్లా ఇంచార్జి డాక్టర్ పెసరు విజయ్ చందర్ రెడ్డి, తక్కలపాడు గ్రామంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ కాళీ ప్రసాద్ రావు, అలాగే పసరుగొండ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మంద ఐలయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దుర్గంపేట, కొగిల్వాయి, పులుకుర్తి తదితర గ్రామాల్లో కూడా బూత్ అధ్యక్షులు పార్టీ జెండాలను ఆవిష్కరించి బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొండి జితేందర్ రెడ్డి, శ్రీరామ్ రెడ్డి, నాగరాజు, మాదారపు రతన్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పొదల మధుకర్, వాజపేయి, సర్పంచ్‌లు కొట్టె శ్రీవాణి రమేష్, చుక్క వనిత మహేందర్, ఉప సర్పంచ్‌లు బండారి ప్రభాకర్, మంద మనోజ్, వార్డు మెంబర్లు జంగిలి నాగరాజు, గన్ను సతీష్, సుర చందర్, ముఖేష్, చంద్రకిరణ్, మెరుగు శ్రీనివాస్, కొట్టె రాజు, శక్తి కేంద్ర ఇంచార్జీలు గోగుల సమ్మిరెడ్డి, పెరుక శ్రీనివాస్, సంతోష్, రమణ రెడ్డి, పెంట రమేష్ మరియు బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ దివ్యాంగ ధ్రువపత్రంతో ఉద్యోగం

**తక్షణ విచారణ చేపట్టాలని డిమాండ్**



**ఉద్యమ కెరటం, వరంగల్:** వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో దివ్యాంగుల బ్యాక్‌లాగ్ నియామకాల్లో భాగంగా టైపిస్టుగా పనిచేస్తున్న ముసుకు కృష్ణ నకిలీ దివ్యాంగ ధ్రువపత్రంతో ఉద్యోగం పొందినట్టు వివిధ సంఘాల నాయకులు ఆరోపించారు. అతనిపై వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ రాష్ట్ర నేత బిర్రు మహేందర్ మాదిగ, రాష్ట్ర నాయకులు తడుగుల విజయ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ మాదిగ మాట్లాడుతూ ముసుకు కృష్ణ తండ్రి వీరమల్లు 2010 డిసెంబర్ 25న సదరం ద్వారా లైఫ్ లాంగ్ దివ్యాంగ సర్టిఫికెట్ పొందినట్లు తెలిపారు. ఆ సర్టిఫికెట్ ఆధారంగా వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో పెన్షన్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడని, ప్రస్తుతం ప్రమోషన్ కోసం ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నారు. అయితే అతను నిజమైన దివ్యాంగుడు కాదని, నకిలీ ధ్రువపత్రంతో ఉద్యోగం పొందడం ద్వారా అసలు అర్హులైన దివ్యాంగులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ముసుకు కృష్ణ దివ్యాంగ సర్టిఫికెట్‌ను తక్షణమే రీ–వెరిఫికేషన్ చేయాలని, ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించాలని, నిజానిజాలు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు విచారణ జరపాలని ఆదేశాలు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బాబురాజు యాదవ్, ఎమ్మార్పీఎస్ వరంగల్ మండల అధ్యక్షుడు కన్నెబోయిన ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** మండలంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కోడె రమేశ్ పార్టీ జెండాను ఆవిష్కరించి నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి ఉత్సాహభరిత వాతావరణంలో వేడుకలు జరిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఎంతో విశిష్టమైన రోజు అని పేర్కొన్నారు. దేశ సేవ, జాతీయత, అభివృద్ధి లక్ష్యాలతో స్థాపించిన బీజేపీ కోట్లాది భారతీయుల ఆశయాలకు ప్రతీకగా నిలిచిందని తెలిపారు. పార్టీ కేవలం ఒక రాజకీయ సంస్థ మాత్రమే కాకుండా దేశాభివృద్ధికి అంకితమైన ఒక ఆలోచన, ఒక సిద్ధాంతమని పేర్కొన్నారు. పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రవేశపెట్టిన 'అంత్యోదయ'సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్తూ సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరేలా బీజేపీ కృషి చేస్తోందని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని, స్వచ్ఛ భారత్, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి పథకాల ద్వారా దేశాన్ని ప్రపంచ అగ్రదేశాల సరసన నిలపడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని, గ్రామ స్థాయి నుంచి దేశ స్థాయి వరకు సేవా భావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వాజిద్ హుస్సేన్, మండల పదాధికారులు విగ్నేష్ గౌడ్, నరసింహులు, ఎల్లెందర్, సర్పంచులు పొన్నాల మహేష్, బండ దేవయ్య, సుకన్య, నాయకులు పత్తి స్వామి, గంట అశోక్, డాక్టర్ సత్యనారాయణ, కృష్ణకాంత్ యాదవ్, రవీందర్ నాయక్, దేవేందర్ యాదవ్, దేవరాజు, మల్లేష్ గౌడ్, శంకర్, శ్రీనివాస్, నరేష్, అనిల్, రాజేష్, నవీన్, తిరుపతి, దేవేందర్ నాయక్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

# మన ఇసుక వాహనంతోనే దరఖాస్తు చేసుకోవాలి

- నేరుగా కూపన్లు ఇచ్చే విధానం రద్దు
- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** నిర్మాణదారులు ఇసుక కోసం మన ఇసుక వాహనం ద్వారా ఆన్లైన్లోనే దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సెంటర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో రూపొందించిన మన ఇసుక వాహనం అప్లికేషన్, వెబ్ సైట్ లో నిర్మాణదారులు తమకు నచ్చిన ఇసుక రీచ్ నుంచి ఇసుక బుకింగ్ చేసుకునే అవకాశం ఉందని, దరఖాస్తు చేసుకోవడం చాలా సులభమని పేర్కొన్నారు. నిర్ణీత పత్రాలు జత చేస్తే ఇసుక పొందవచ్చని స్పష్టం చేశారు. జిల్లా కమిటీ ఆమోదించిన ఇసుక రీచ్ ల నుంచే ఇసుక తరలించవచ్చని, ఇసుక తరలింపులో నేరుగా కూపన్లు ఇచ్చే విధానం రద్దు అయిందని వివరించారు. ఆన్లైన్ ద్వారా పొందే విధానం అమలు చేస్తున్నామని, ఇసుక కేటాయింపు, తరలింపు పూర్తి పారదర్శకంగా ఉంటుందని స్పష్టం చేశారు. మధ్యవర్తుల అవసరం లేకుండా ప్రజలు నేరుగా ఆన్లైన్ ద్వారా ఇసుకను బుక్ చేసుకునే సౌకర్యం రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో కల్పించిందని, దీంతో అక్రమ రవాణాను నివారించడం జరుగుతుందన పేర్కొన్నారు. అలాగే మన ఇసుక వాహనం విషయమై సమాచారం, వివరాలు తెలుసుకునేందుకు టోల్ ఫ్రీ నం.040- 23120421/8333923732 ఫోన్ నంబర్లు అందుబాటులో ఉన్నాయని, మెయిల్ ఐడీ help-desk.tsmiv@cgg.gov.in సేవలు ఉన్నాయని తెలిపారు. ఇసుక బుక్ చేసుకునేటప్పుడు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అధికారి జారీ చేసిన ధ్రువపత్రం, ఇతర ఇంటి నిర్మాణానికి సంబంధిత పంచాయతీ కార్యదర్శి, అధికారి జారీ చేసిన ఇంటి నిర్మాణ అనుమతి పత్రం, ప్రభుత్వ పనులకు సంబంధిత కార్య నిర్వహణ ఇంజనీర్ జారీ చేసిన అనుమతి పత్రం ఉండాలని పేర్కొన్నారు. నిర్మాణదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకొని ఇసుక పొందాలని వివరించారు.

## ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలోని కొమ్రంభీం చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. తిర్యాణి మండల ప్రధాన కార్యదర్శి గాయెంగి తిరుపతి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల ఎన్నికల కన్వీనర్ పులి వెంకటేష్ మాట్లాడుతూ 46 ఏళ్ల ప్రస్థానంలో భారతీయ జనతా పార్టీ అనేక ఉన్నత శిఖరాలను అధిరోహించిందని పేర్కొన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే పార్టీగా నిలిచిందని తెలిపారు. పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ్, శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని పార్టీ కార్యకర్తలు, నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గాయెంగి తిరుపతి, ఎస్టీ మోర్చా జిల్లా నాయకుడు కనక హన్మంత్ రావు, మాధవి సీతారాం, తొడసం భాస్కర్, ఎస్సీ మోర్చా నాయకుడు చునర్కర్ రంగు అరుణ్ కుమార్, తిరుపతి, చుంచు శ్రీనివాస్, మాధవి పితంబర్, తొడసం దాస్వంత్ రావు, మంగ రాజేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల ప్రారంభం



**ఉద్యమ కెరటం, తాండూర్:** మాదారం గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులను సోమవారం గ్రామ సర్పంచ్ కృష్ణపల్లి లక్ష్మణ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధిహామీ పనులను జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాబ్ కార్డు లేని వారు దానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే ఉపాధిహామీ పనులకు హాజరయ్యే కూలీలకు తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డ్ మెంబర్ లక్ష్మీ, కాంగ్రెస్ నాయకులు మీసా శంకర్, మీనుగు కృష్ణ, బుతుకూరి కమలాకర్, పుప్పాల శ్రీనివాస్, ఇప్ప శంకర్, సిరికొండ సత్యనారాయణ, టి. ఈ సందీప్, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్, మెటో పుష్ప, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## బస్సుల కొరతతో ప్రయాణికుల ఇక్కట్లు



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ బస్ స్టాండ్ వద్ద బస్సుల కొరత కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణంగా నడిచే బస్సులు తగ్గిపోవడంతో బస్ స్టాండ్‌లో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్కో బస్సు వచ్చినప్పుడు వందలాది మంది ఒకేసారి ఎక్కేందుకు ప్రయత్నించడంతో తోపులాటలు, కొట్లాటలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితి కారణంగా మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు సమయానికి చేరుకోలేక ఆలస్యమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ పనుల కోసం వెళ్లే ఉద్యోగులు కూడా సమయానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ప్రయాణికులు ఆర్టీసీ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, తక్షణమే అదనపు బస్సులు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## హెచ్‌పీవీ వ్యాక్సిన్ పోస్టర్ ఆవిష్కరణ




**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్‌లో అడిషనల్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల చేతుల మీదుగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ అవగాహన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సైతం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్‌పీవీ వైరస్ ద్వారా గర్భాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ముఖ్యంగా 14 సంవత్సరాలు నిండిన బాలికలు సరైన సమయంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకుంటే భవిష్యత్తులో ఈ క్యాన్సర్‌ను నివారించవచ్చని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ అనంతరం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, బాలికల తల్లిదండ్రులకు వ్యాక్సిన్ ప్రాముఖ్యతను వివరించారు. ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ సూచనల మేరకు వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజంలో ఆరోగ్యంపై చైతన్యం పెంచడం తమ లక్ష్యమని ఏఏఎఫ్ఏ సంఘం సభ్యులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగర్ల శ్రీకాంత్, సిర్పూర్ తాలూకా అధ్యక్షుడు ఈగురపు సాయితేజ, సురేష్, సాయి, చెర్రీ, నవీన్, సిద్ధార్థ్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిటి రణదీవే వర్ధంతి



**ఉద్యమ కెరటం, తాండూర్:** సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ బిటి రణదీవే 36వ వర్ధంతిని సోమవారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ ప్రాంగణంలో సీఐటీయూ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగాం రాజారాం మాట్లాడుతూ బిటి రణదీవే కార్మికులు, కర్షకుల హక్కుల కోసం జీవితాంతం పోరాటం చేసిన మహానేత అని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. ఆ కాలంలోనే ముంబైలో కార్మిక సంఘాలను స్థాపించి అనేక కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించారని పేర్కొన్నారు. భారత దేశంలో అఖిల భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి కీలక నాయకుడిగా రణదీవే 1970లో బాధ్యతలు చేపట్టి, 1991 వరకు సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ బలోపేతానికి కృషి చేశారని అన్నారు. కార్మికుల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చిన నిస్వార్థ నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని తెలిపారు. 1940లో అరెస్టై జైలులో ఉన్న సమయంలో కూడా ఖైదీల సమస్యలపై పోరాటాలు నిర్వహించి రాజకీయ శిక్షణ తరగతులు చేపట్టారని తెలిపారు. జీవితాంతం కార్మికవర్గ ఐక్యత కోసం కృషి చేసిన రణదీవే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తన్నీరు శ్రీను, ధర్మరాజుల వెంకటేష్, ఇందూరి మల్లయ్య, వడ్నాల చందు, సదుల రవీందర్, శ్రీను, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారామచంద్రస్వామి కళ్యాణం



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండలం గజ సింగవరం గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు కన్నుల పండుగగా నిలిచాయి. ఈ సందర్భంగా శ్రీ రామలింగేశ్వర స్వామి పునఃప్రతిష్ట, శ్రీ సీతారాముల నూతన విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఆంజనేయ స్వామి, పంచాయతన, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాలలో నవగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాలను జరిపారు. ఉదయం 9.05 గంటలకు వృషభ లగ్న పుష్కరాంశ సుముహూర్తంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణను నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో గ్రామ సర్పంచ్ ఉమ్మారెడ్డి విమల శంకర్ రెడ్డి దంపతులు, ఉప సర్పంచ్ భాస్కర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీసీ అధ్యక్షులు సంగీటం శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఉచ్చిడి మోహన్ రెడ్డి, సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి, సీఐ వెంకటేష్, ఎస్సై అనిల్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కళా చక్రపాణి, ఎల్లారెడ్డిపేట మాజీ సింగిల్ విండో అధ్యక్షులు కృష్ణారెడ్డి, అర్చకులు బుగ్గ కృష్ణమూర్తి శర్మ, నాయకులు దయాకర్ రావు, బాబు, వెంకట్ స్వామి గౌడ్, బండారి బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన పకడ్బందీగా అమలు చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య సూచించారు. సోమవారం జిల్లాలోని కోటపల్లి మండలం కోటపల్లి, మల్లంపేట, నీల్వాయి గ్రామపంచాయతీల్లో కొనసాగుతున్న పారిశుధ్యం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి ప్రతిరోజు చెత్త సేకరణ జరగాలని, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించి నివాస ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా మంజూరైన లబ్ధిదారులు నిర్ణీత విస్తీర్ణంలో నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకునేలా అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. నిర్మాణ దశలకు అనుగుణంగా బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇసుకను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ క్షేత్రాల్లో వరి వంగడాలను తయారు చేసే పద్ధతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుమారస్వామి, మండల పంచాయతీ అధికారి వెంకటేష్, పంచాయతీరాజ్ ఏఈ ప్రదీప్, గృహనిర్మాణ శాఖ ఏఈ కార్తీక్, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లా విద్యార్థుల కల సాకారం

- జిల్లాకే ప్రభుత్వ యూనివర్సిటీ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చారిత్రాత్మక ప్రకటన
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థి లోకం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ఆదిలాబాద్ జిల్లా విద్యార్థుల దశాబ్దాల నాటి కల నెరవేరబోతోంది. జిల్లా కేంద్రంలోనే ప్రభుత్వ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చారిత్రాత్మక ప్రకటన చేశారు. సోమవారం ఆదిలాబాద్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. 'పీపుల్స్ మార్చ్' పాదయాత్రకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండలం పిప్రిలో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి ఈ కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. జిల్లాలో యూనివర్సిటీ లేక పోవడంతో ఆదివాసీ, గిరిజన, వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్య కోసం హైదరాబాద్, నిజామాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో విద్యార్థులు ఆర్థికంగా, ప్రయాణ పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యపై గత కొంత కాలంగా విద్యార్థి సంఘాలు, సామాజిక కార్యకర్తలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ పోరాటం చేస్తున్నారు. జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా వైస్ చైర్మన్ రాథోడ్ సందీప్, సామాజిక కార్యకర్తలు సోలంకి ప్రశాంత్, నర్సింగ్ దాస్ తదితరులు పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పించారు. గతంలో జిల్లాకు రావాల్సిన గిరిజన యూనివర్సిటీ ములుగుకు తరలిపోవడంతో జరిగిన అన్యాయాన్ని కూడా వారు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కొత్తగా మంజూరు చేసే యూనివర్సిటీని నిర్మల్ జిల్లాకు కాకుండా ఆదిలాబాద్ జిల్లాలోనే ఏర్పాటు చేయాలని నిరంతరం డిమాండ్ చేశారు. ఇటీవల మార్చి 7న నేరడిగొండ మండలానికి వచ్చిన జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావును రాథోడ్ సందీప్ బృందం కలిసి వినతి పత్రం అందజేసింది. ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన, ఆదివాసీ విద్యార్థులు అధికంగా ఉన్నారని, ఉన్నత చదువుల కోసం ఇతర జిల్లాలకు వెళ్లడం ద్వారా పేద విద్యార్థులు చదువులు మధ్యలోనే మానేయాల్సి వస్తోందని వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి, సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూల నిర్ణయం వెలువడింది. జిల్లా కేంద్రంలోనే యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. యూనివర్సిటీకి అవసరమైన భూ సేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. యూనివర్సిటీ ఏర్పాటుతో జిల్లాలో ఉన్నత విద్య అవకాశాలు పెరగడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ముఖ్యమంత్రి తెలిపారు. త్వరలోనే మళ్లీ జిల్లాకు వచ్చి యూనివర్సిటీ పనులకు స్వయంగా శంకుస్థాపన చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ప్రకటనపై జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు సంబరాలు జరుపుకుంటున్నారు. రాథోడ్ సందీప్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని తమ విన్నపాన్ని మన్నించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సహకరించిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయంతో జిల్లాలోని వేలాది మంది పేద విద్యార్థులకు ఉన్నత చదువులు, చేరువవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# బోథ్ నియోజకవర్గ కోసం సీఎంకు ఎమ్మెల్యే వినతి




**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** పిప్పిరి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ప్రతిపాదించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా స్కూల్, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్, అలాగే పిప్పిరి, తేజాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. బోథ్‌లో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు దగ్గర చేయాలని కోరారు. బుగ్గారం, సుంకిడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులతో పాటు 22 కొత్త చెరువుల నిర్మాణం, 18 చెరువులకు మరమ్మతులు, 23 చెక్‌డ్యాంల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే దహేగాం ప్రాజెక్ట్ నిర్వాసితులైన 200 కుటుంబాలకు పునరావాసం కింద ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. బోథ్ పట్టణంలో సెంట్రల్ లైటింగ్, రింగ్ రోడ్డు కోసం రూ.43 కోట్లు కేటాయించాలని కోరడంతో పాటు ఇచ్చోడ–సిరికొండ డబుల్ రోడ్డు, సిరిచేల్మ–పులగం పండ్రి, భరంపూర్–మోర్కండి, జందాపూర్–కరంజి రోడ్ల పనులను పూర్తి చేసి కొత్త రోడ్లకు నిధులు కేటాయించాలని కోరారు. నేరడిగొండ, ఇచ్చోడ, బోథ్, తలమడుగు, సోనాల, భీంపూర్, సిరికొండ మండలాల్లో ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలు నిర్మించాలని, బోథ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని విన్నవించారు. వ్యవసాయ రంగానికి సంబంధించి తలమడుగు మండలంలోని సుంకిడిలో మార్కెట్ కమిటీ ఏర్పాటు చేయాలని, దీంతో తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల రైతులకు ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. వర్షాకాలంలో భారీ వర్షాలతో నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం ఇవ్వాలని, జొన్న, మొక్కజొన్న పంటలను పరిమితులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. అలాగే ఇచ్చోడ పీహెచ్‌సీని 30 పడకల సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలని, నియోజకవర్గానికి అదనంగా 2వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, గిరివికాసం పథకంలో నిధులు పెంచాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. గ్రామాల అభివృద్ధికి రూ.20 కోట్లు, రైతుల పొలాల రహదారుల నిర్మాణానికి మరో రూ.20 కోట్లు కలిపి మొత్తం రూ.40 కోట్లు ఎస్డీఎఫ్ నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా కుంటాల, గాయత్రి, పొచ్చెర, కనకాయి జలపాతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్నారు. సిరిచెల్మ మల్లికార్జున స్వామి దేవాలయం, భరంపూర్ వెంకటేశ్వర స్వామి దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, ఇచ్చోడలో షాదిఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అటవీ అనుమతుల కారణంగా నిలిచిపోయిన రోడ్ల పనులకు వెంటనే క్లియరెన్స్ ఇవ్వాలని కూడా కోరారు. మధుర (లబానా/బంజారా) వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని విజ్ఞప్తి చేశారు. ఈ అన్ని అంశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం రూపంలో సమర్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# ప్రజలే కేంద్రంగా మా పాలన

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పిప్రిలో భారీ బహిరంగ సభ
- రూ.1238 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రాష్ట్రానికి మానవీయ కోణం ఉంది.. అంతరాలు లేని సమాజం నిర్మాణమే మా లక్ష్యం
- కోరితెచ్చుకున్న తెలంగాణ ప్రజలచే పాలించాలి, ఫ్యూడల్స్ తో కాదు
- ప్రజలే కేంద్రంగా మా పాలన, ప్రజల ఆలోచన మా విధానం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లాలోని పిప్రి గ్రామంలో సోమవారం నిర్వహించిన భారీ బహిరంగ సభలో రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.1238 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ సభ తన ఆలోచన కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనతోనే నిర్వహించామని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే ఈ సభ లక్ష్యమని చెప్పారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా పిప్పిరి నుంచి ఖమ్మం వరకు ప్రజల సమస్యలను విన్నామని, వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలలో 99 శాతం ఇప్పటికే అమలు చేసినట్లు తెలిపారు. అధికారాన్ని హోదా కోసం కాకుండా ప్రజలకు సేవ చేయడానికి వినియోగిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రూ.22,500 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణం ప్రారంభించామని, ఒక్కో ఇంటిని రూ.5లక్షల వ్యయంతో నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రైతు భరోసా పథకంలో భాగంగా తొమ్మిది రోజుల్లోనే రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. అలాగే రాష్ట్రంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఇప్పటివరకు మహిళలు 300 కోట్ల సార్లు ఉచితంగా ప్రయాణం చేసినట్లు వివరించారు. అంతరాలు లేని సమాజం నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఒక్కో పాఠశాలను రూ.200 కోట్లతో 25 ఎకరాల్లో నిర్మిస్తున్నామని, రాష్ట్రంలో ఇప్పటికే మూడు పాఠశాలలకు శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ప్రమాద బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5లక్షల బీమా రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థికి ఉదయం అల్పాహారం, రాగి జావా లేదా పాలు అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రజలే కేంద్రంగా పాలన కొనసాగుతుందని, ప్రజల ఆలోచనలే ప్రభుత్వ విధానమని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు కోరుకొని సాధించుకున్న రాష్ట్రం ప్రజల చేత పాలించబడాలని, ఫ్యూడల్ వ్యవస్థకు స్థానం లేదని అన్నారు. ప్రజల కోసం పనిచేసే ఈ ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆదరించి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువత కోసం రాజీవ్ యువ వికాసం వంటి పథకాలు అమలు చేస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

# ఆదిలాబాద్ సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

## రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా సమగ్ర అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయాలు కేవలం ఎన్నికల వరకే పరిమితం కావాలని, అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకుని ముందుకు సాగుతామని తెలిపారు. బజార్ హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో నిర్వహించిన "ప్రజా పాలన– ప్రగతి బాట"బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ అభివృద్ధి పై తన ప్రభుత్వ ఉక్కు సంకల్పాన్ని చాటారు. కొమురం భీమ్ పోరాట స్ఫూర్తి ఉన్న ఈ నేలను పాలమూరు జిల్లా తో సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు.

**సంక్షేమ పథకాలలో విప్ల వాత్మక మార్పులు..**

గత ప్రభుత్వాలు చేయని పలు వినూత్న నిర్ణయాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని సీఎం వెల్ల డించారు. మహిళల సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, దీనిపై ఇప్పటి వరకు సుమారు 10వేల కోట్ల వ్యయం చేశామని తెలిపారు. మహిళలను కేవలం ప్రయాణికులుగా కాకుండా బస్సుల యజమానులుగా మారుస్తున్నామని, సోలార్ విద్యుత్ ఉత్పత్తిలోనూ వారికి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయానికి హైదరాబాద్ హైటెక్ సిటీలో ప్రత్యేక విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పేదల సంక్షేమం కోసం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 22,500 కోట్ల వ్యయంతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేశామని వెల్లడించారు. ఇప్పటికే లబ్ధి దారుల ఖాతాల్లో 5,400 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని 3.17 కోట్ల మందికి నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని, పేదల ఆహార భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

**ఆదిలాబాద్‌ను అభివృద్ధి హబ్‌గా తీర్చిదిద్దు తాం**

జిల్లా అభివృద్ధి దిశగా పలు కీలక ప్రకటనలు చేసిన ముఖ్యమంత్రి, ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణానికి కేంద్ర అనుమతులు సాధించామని తెలిపారు. వీలైతే జూన్ 2న శంకుస్థాపన చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. జిల్లాలో యూనివర్సిటీ స్థాపనకు త్వరలోనే శంకుస్థాపన చేయనున్నామని, భూసేకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని వెల్లడించారు. ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్ద పునఃప్రారంభించి, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లా ను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు.

**ఆధ్యాత్మిక అభివృద్ధి కి ప్రాధాన్యం..**

బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ అభివృద్ధి కి రూ.225 కోట్లు మంజూరు చేశామని, అవసరమైతే మరిన్ని నిధులు కూడా అందిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. అదేవిధంగా గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధి కి కూడా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

**ప్రజల సేవే ధ్యేయం..**

తాము పాలకులం కాదని, ప్రజల సేవకులమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి రెండు నెలలకోసారి ఆదిలాబాద్ జిల్లాకు వచ్చి అభివృద్ధి పనులను స్వయంగా సమీక్షిస్తానని భరోసా ఇచ్చారు. జిల్లా సమగ్రాభివృద్ధి కి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. సభలో డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రభుత్వ విధానాలు, సంక్షేమ కార్యక్రమాలపై వివరించారు. ఈ సభ తన ఆలోచన కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు నిర్వహించామని స్పష్టం చేశారు. రూ.1,238 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజలే కేంద్రంగా పాలన కొనసాగుతోందని, ప్రజల ఆలోచనలే ప్రభుత్వ విధానాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. అంతరాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. తెలంగాణ ప్రజలు కోరుకున్న విధంగా ప్రజల చేతనే పాలన జరగాలని, ఫ్యూడల్ విధానాలకు తావులేదని స్పష్టం చేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయడమే నిజమైన ప్రజా పాలన అని సీఎం రేవంత్ రెడ్డి సూచించారని తెలిపారు. ఆ దిశగా పిప్రి నుంచి ఖమ్మం వరకు ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సభ రాజకీయ కార్యక్రమం కాదని, ప్రజలతో ఏర్పడిన అనుబంధానికి ప్రతీక అని వివరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లో నే 99 శాతం హామీలు అమలు చేసిన ఘనత సాధించిందని తెలిపారు. పాలకులుగా కాకుండా సేవకులుగా పనిచేస్తున్నామని, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.22,500 కోట్ల వ్యయంతో నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణం ప్రారంభించామని, ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఖర్చు చేస్తున్నామని వెల్ల డించారు. రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లో రూ.9,000 కోట్లు జమ చేశామని తెలిపారు.మహిళల సంక్షేమం కోసం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని పేర్కొన్నారు. ఇప్పటివరకు మహిళలు 300 కోట్ల సార్లు ఉచితంగా ప్రయాణం చేశారని తెలిపారు.విద్యా రంగంలో భాగంగా 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' నిర్మాణం చేపట్టామని, ఒక్కో పాఠశాలను రూ.200 కోట్లతో 25 ఎకరాల్లో నిర్మిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి బిడ్డ ఆకలితో బడికి వెళ్లకూడదనే ఉద్దేశంతో అల్పాహారం పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు.ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఇందిరమ్మ ప్రమాద బీమా సౌకర్యం కల్పించామని, నిరుద్యోగ యువత కోసం 'రాజీవ్ యువ వికాసం' కార్యక్రమం చేపట్టామని వివరించారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.రాష్ట్రం అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడే స్థాయికి చేరాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, ప్రజలు ఈ ప్రభుత్వాన్ని గుండెల్లో పెట్టుకుని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ గోడం నగేష్, స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు తదితరులు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి చేతుల మీదుగా 30,149 స్వయం సహాయక సంఘాలకు రూ.53 కోట్ల 50లక్షల విలువైన బ్యాంకు లింకేజీ చెక్కులను అందజేశారు. ఎంపిక చేసిన ఐదుగురు లబ్ధిదారులు కిష్టయ్య, రాధ, భాగ్య, పద్మ, సుబ్బలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప త్రాలను పంపిణీ చేశారు. ఉత్తమ పాలన కనబరిచిన 5 గ్రామ పంచాయతీలకు ఐఎస్ఓ సర్టిఫికేషన్లను అందజేశారు. సీఎం కప్ స్టేట్ ఛాంపియన్‌షిప్ ఆదిలాబాద్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సభలో ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఐటిడిఏ పిఓ యువరాజ్ మర్మట్, అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, శాసన సభ్యులు పాయల శంకర్, వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ విఠల్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, ఇతర ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఎంకు వెంకటేశ్వర స్వామి విగ్రహం అందజేత



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** బజార్ హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన– ప్రగతి బాట భారీ బహిరంగ సభకు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆదిలాబాద్ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ శాంతన్ రావు వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని సన్మానించిన నాయకులు ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం, డిప్యూటీ సీఎంలకు డీసీసీ సన్మానం



**ఉద్యమ కెరటం, బజార్ హత్నూర్:** ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా బజార్ హత్నూర్ మండలం పిప్పిరి గ్రామానికి సోమవారం వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్కలను ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి శాలువాలతో సత్కరించి జిల్లా ప్రజల తరఫున స్వాగతం పలికారు. అనంతరం జిల్లా లో విద్య, వైద్యం, రహదారులు, తాగునీటి సదుపాయాల అభివృద్ధితో పాటు యూనివర్సిటీ, ఇంజనీరింగ్ కళాశాల స్థాపన, ఇరిగేషన్ ప్రాజెక్టుల మంజూరుకు సంబంధించి వినతి పత్రాలను అందజేశారు. జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతూ డీసీసీ నేతలు తమ అభ్యర్థనలు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు జిల్లా నాయకుల ప్రశంసలు

**ఉద్యమ కెరటం, బజార్ హత్నూర్:** బజార్ హత్నూర్ మండలం పిప్పిరి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన ప్రగతి బాట కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా తెలంగాణ క్రీడా పాఠశాల ఆదిలాబాద్‌కు చెందిన క్రీడాకారిణులను జిల్లా నాయకులు అభినందించారు. తెలంగాణ స్థాయిలో ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించి ఆదిలాబాద్ జిల్లా కు గౌరవం తీసుకువచ్చినందుకు డీవైఎస్ఓ శ్రీనివాస్, విద్యార్థినులు, కోచ్ రాజును జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఆసిఫ్ ఖాన్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కోటేష్, ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి, జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డి నేటర్ శ్రీకర్ గౌడ్ తదితరులు కార్యకర్తలతో కలిసి క్రీడాకారులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన క్రీడాకారులు భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.



# వార్డుల్లో అభివృద్ధి పనుల పరిశీలన



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 18, 23వ వార్డు ల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్ పర్సన్ రిహన కమల్ పాషా సోమవారం పరిశీలించారు. వార్డు ల్లోనూతనంగా ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైపులైన్ పనులతో పాటు మురుగు కాలువల శుభ్రపరిచే పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీల్లో పూడికతీత పనులను వేగవంతం చేయాలని సూచించారు. వార్డు ల్లోపరిశుభ్రతను మెరుగుపర్చి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు మానస రాము, విరివాడ అపర్ణ నాగభూషణం, మున్సిపల్ కమిషనర్, ఏఈ, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డు లు జారీ

## స్పెషల్ కమిషనర్ ప్రియాంక



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రెడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని సమాచార, పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక తెలిపారు. అక్రెడిటేషన్ దరఖాస్తులపై ఇటీవల మీడియాలో వస్తున్న వార్తలపై జర్నలిస్టులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో ఇప్పటి వరకు అందిన దరఖాస్తులను ఈనెల 10వ తేదీన నిర్వహించే రాష్ట్ర స్థాయి అక్రెడిటేషన్ కమిటీ సమావేశంలో పరిశీలించి అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులను మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులు ఆన్లైన్ ద్వారా తమ దరఖాస్తులను అప్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ నెలలో అక్రెడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో కూడా ఈ నెలలోనే జిల్లా కమిటీలు సమావేశాలు నిర్వహించి అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు వివరించారు. జిల్లా ల వారీగా అక్రెడిటేషన్‌కు అర్హులైన జర్నలిస్టు లు ఆలస్యం చేయకుండా వెంటనే ఆన్లై న్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

# క్రీడాకారిణిలను అభినందించిన సీఎం




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం పిప్పిరి పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లా భట్టి విక్రమార్క తెలంగాణ క్రీడా పాఠశాల ఆదిలాబాద్ విద్యార్థినులను అభినందించారు. రాష్ట్రస్థాయి ఓవరాల్ చాంపియన్షిప్ సాధించినందుకు డీవైఎస్ఓ జక్కుల శ్రీనివాస్‌తో పాటు విద్యార్థినులు శివాని, సహస్ర, నాగప్రియ, బృందాన్ని, కోచ్ రాజును సీఎం ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా డీవైఎస్ఓ జక్కుల శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడా పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్య ప్రారంభించడంతో పాటు రెండు ఇండోర్ హాళ్లు, 400 మీటర్ల సింథటిక్ ట్రాక్ అవసరాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# సీఎంకు నాగలి బహుకరణ



**ఉద్యమ కెరటం, బజార్ హత్నూర్:** రైతుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నాగలి బహుకరించినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య తెలిపారు. బజార్ హత్నూర్ మండలం పిప్పిరి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక భారీ బహిరంగ సభకు హాజరైన సీఎంను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్కే పాండురంగ్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రైతులతో కలిసి నాగలి అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటలైన పత్తి, సోయాబీన్ పంటలకు బోనస్ ప్రకటించాలనే విషయాన్ని కూడా ముఖ్యమంత్రికి ప్రస్తావించనున్నట్లు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.





## మైదానంలోనే కన్నీళ్లు పెట్టుకున్న
# సంజీవ్ గోయెంకా!

**హైదరాబాద్:** సంజీవ్ గోయెంకా ఈ పేరుకు పెద్ద పరిచయం అక్కర్లేదు. భారతదేశ బిజినెస్ టైకూన్స్ లో ఒకరైన ఈయన ఐపీఎల్ ద్వారా భారతీయులకు మరింత చేరువయ్యారు. ఈయన సాధారణంగా ఐపీఎల్ మ్యాచ్‌ల్లో తన జట్టు కెప్టెన్ పై లేదా కోచ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, క్లాస్ పీకుతూ కన్పిస్తూ ఉంటాడు. లక్నో సూపర్ జెయింట్స్ యజమాని అయిన సంజీవ్ గోయెంకా ఈసారి మాత్రం పూర్తి భిన్నంగా కనిపించారు. సన్ రైజర్స్ హైదరాబాద్ తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో లక్నో విజయం సాధించిన తర్వాత ఆయన కళ్లు చెమర్చాయి. మైదానంలోనే ఆయన ఆనందంతో కన్నీరు పెట్టుకున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఐపీఎల్ 2026 సీజన్ లో లక్నో సూపర్ జెయింట్స్‌కు ఇది తొలి విజయం. తమ మొదటి మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో ఓటమి పాలైన లక్నోకు, హైదరాబాద్‌పై గెలవడం అత్యవసరంగా మారింది. ఈ గెలుపు జట్టు యజమాని సంజీవ్ గోయెంకాకు ఎంత ప్రాముఖ్యమో ఆయన ప్రవర్తనను బట్టి అర్థమవుతోంది. మ్యాచ్ చివరి ఓవర్లలో జట్టు గెలవాలని ఆయన భక్తితో ప్రార్థిస్తూ కనిపించారు. విజయం ఖాయం కాగానే తన ఉద్వేగాన్ని ఆపుకోలేక కన్నీళ్లు తుడుచుకుంటూ ఉండడం కెమెరాలకు చిక్కింది. గోయెంకా లోని ఈ ఎమోషనల్ యాంగిల్ చూసి అభిమానులు ఇప్పుడు ఆశ్చర్యపోతున్నారు. హైదరాబాద్ లోని ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన లక్నో కెప్టెన్ రిషబ్ పంత్.. సన్‌రైజర్స్ బ్యాటింగ్ బలాన్ని పరీక్షిస్తామంటూ వారిని ముందుగా బ్యాటింగ్ కు ఆహ్వానించారు. అయితే మహమ్మద్ షమీ నేతృత్వంలోని లక్నో బౌలర్లు నిప్పులు చెరిగే బంతులతో హైదరాబాద్ బ్యాటర్లను కట్టడి చేశారు. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో సన్‌రైజర్స్ 9 వికెట్ల నష్టానికి కేవలం 156 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఇక 157 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నోకు కెప్టెన్ రిషబ్ పంత్ వెన్నెముకగా నిలిచారు. పంత్ అద్భుతమైన అర్ధసెంచరీ (68 పరుగులు) చేయగా, మరోవైపు ఎయిడెన్ మార్క్రామ్ (45 పరుగులు) కీలక ఇన్నింగ్స్ ఆడారు. చివరి నిమిషం వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్లో మరో ఒక్క బంతి మిగిలి ఉండగానే లక్నో విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో పాయింట్ల పట్టికలో లక్నో 7వ స్థానానికి చేరుకుంది. గతంలో ఆటగాళ్లపై అసహనం వ్యక్తం చేసిన గోయెంకా, ఇప్పుడు టీమ్ గెలుపు కోసం కన్నీరు పెట్టుకోవడం చూస్తుంటే ఈ సీజన్ విజయంపై ఆయన ఎంత పట్టుదలగా ఉన్నారో స్పష్టమవుతోంది.

# ఆర్‌సీబీకి బీసీసీఐ మద్దతు

## అందుకేనా ఈ వరుస విజయాలు?



### ఆడిన రెండు మ్యాచ్‌లలో గెలిచిన ఆర్‌సీబీ
### ఆడిన మూడు మ్యాచ్‌లలో ఓడిపోయిన సీఎస్‌కే
### ఆర్‌సీబీకి మద్దతుగా బీసీసీఐ

**బెంగళూరు:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026లో షెడ్యూల్ వ్యవహారం ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఆదివారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్ల మధ్య మ్యాచ్ అనంతరం ఈ వివాదం మరింత ముదిరింది. కొంతమంది అభిమానులు భారత క్రికెట్ మండలి (బీసీసీఐ) షెడ్యూల్‌లో అనుమానాలు ఉన్నాయని, ఆర్‌సీబీకి పరోక్షంగా లాభం చేకూర్చిందని ఆరోపిస్తున్నారు. ఐపీఎల్ 2026లో ఆర్‌సీబీ ఆడిన రెండు మ్యాచ్‌లలో గెలవగా.. సీఎస్‌కే ఆడిన మూడు మ్యాచ్‌లలో ఓడిపోయింది. ఐపీఎల్ 2026లో ఆర్‌సీబీ తమ తొలి మ్యాచ్‌ను మార్చి 28న ఆడింది. ఆ తర్వాత 7 రోజుల విరామం లభించింది. ఇది బెంగళూరు జట్టుకు పెద్ద ప్లస్‌గా మారింది. ఈ విరామం వల్ల ఆటగాళ్లు విశ్రాంతి తీసుకోవడంతో పాటు గాయాల నుంచి కోలుకోవడానికి కూడా సమయం దొరికింది. ముఖ్యంగా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సహా జట్టు మొత్తం చిన్నస్వామి మైదానంలో ఉండటంతో ప్రయాణ అలసట కూడా లేకుండా ఫ్రెష్‌గా బరిలోకి దిగింది. మరోవైపు సీఎస్‌కే పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. మార్చి 30న తొలి మ్యాచ్ ఆడిన చెన్నై.. ఏప్రిల్ 3న రెండో మ్యాచ్ ఆడింది. ఆ తర్వాత పెద్దగా విరామం లేకుండానే బెంగళూరులో ఏప్రిల్ 5న మూడో మ్యాచ్ ఆడాల్సి వచ్చింది.




అస్సాంలో, చెన్నైలో మ్యాచ్‌లు ఆడిన తర్వాత సీఎస్‌కే ప్లేయర్స్ బెంగళూరుకు ప్రయాణం చేయాల్సి వచ్చింది. ఇది జట్టుపై ప్రభావం చూపిందని చెన్నై అభిమానులు అంటున్నారు. బీసీసీఐపై సోషల్ మీడియాలో సీఎస్‌కే అభిమానులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'ఒక జట్టుకు పూర్తి విశ్రాంతి, మరొక జట్టుకు వరుస మ్యాచ్‌లు, ప్రయాణాలు... ఇది సమాన అవకాశమేనా?' అంటూ ప్రశ్నిస్తున్నారు. బీసీసీఐ షెడ్యూల్‌పై పారదర్శకత ఉండాలని, అన్ని జట్లకు సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు కొంతమంది క్రికెట్ విశ్లేషకులు ఈ ఆరోపణలను కొట్టిపారేస్తున్నారు. టోర్నమెంట్ నిర్వహణలో పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని షెడ్యూల్ రూపొందిస్తారని, ప్రతి జట్టుకీ ఏదో దశలో ఇలాంటి పరిస్థితులు ఎదురవుతాయని చెబుతున్నారు. ఏదైమైనా అభిమానుల మధ్య ఈ చర్చ మరికొన్ని రోజులు కొనసాగడం ఖాయం.

# కేకేఆర్ ఇన్నింగ్స్‌కు వరుణుడి ఆటంకం

### కేకేఆర్ ఇన్నింగ్స్‌కు వరుణుడి ఆటంకం
### ఆట నిలిచేసరికి కోల్‌కతా స్కోరు 25/2
### సొంత గడ్డపై తడబడ్డ నైట్ రైడర్స్
### ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసిన గ్జావియర్ బార్ట్‌లెట్



**కోల్‌కతా:** సొంత మైదానంలో విజయంతో బోణీ కొట్టాలనుకున్న కోల్‌కతా నైట్ రైడర్స్ ఆశలపై వరుణుడు నీళ్లు చల్లేలా ఉన్నాడు. ఇన్నింగ్స్ నాలుగో (3.4) ఓవర్‌లోనే వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. వాతావరణ శాఖ చెప్పినట్టే ఇన్నింగ్స్ మధ్యలో వాన అందుకోగా ఇరుజట్ల ఆటగాళ్లు డగౌట్‌కు పరుగులు తీశారు. మైదానం సిబ్బంది పరుగున వచ్చి పిచ్‌ను, ఔట్ ఫీల్డ్‌ను కవర్లతో కప్పేశారు. అప్పటికి కోల్‌కతా వికెట్ నష్టానికి 25 పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న కోల్‌కతా నైట్ రైడర్స్ అంచనా తప్పింది. శుభారంభంతో భారీ స్కోర్ చేయాలనుకున్న ఆ జట్టును ఆదిలోనే పంజాబ్ కింగ్స్ పేసర్ గ్జావియర్ బార్ట్‌లెట్() కష్టాల్లో పడేశాడు. తన మొదటి ఓవర్లోనే రెండు వికెట్లతో కోల్‌కతాను దెబ్బకొట్టాడు. ఆది నుంచి తడబడుతున్న ఫిన్ అలెన్(6)ను ఐదో బంతికి వెనక్కి పంపిన బార్ట్‌లెట్ చివరి బంతికి మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్ కామెరూన్ గ్రీన్(4)ను ఔట్ చేశాడు. 16 పరుగులకే రెండు బిగ్ వికెట్లు పడిన వేళ అజింక్యా రహానే(8 నాటౌట్), అంగ్‌క్రిష్ రఘువంశీ(7 నాటౌట్)లు ఆచితూచి ఆడారు. 3.4 ఓవర్ వద్ద వర్షం పడే సమయానికి కోల్‌కతా స్కోర్.. 25/1.



## ఇంత కుల్లుబోతోడివి
# ఏందయ్యా నువ్వు..

### ఐపీఎల్‌పై పీసీబీ ఛైర్మన్ ఏడుపు!
### 'నెంబర్ వన్' అవుతామంటూ సంచలన వ్యాఖ్యలు!
### పీఎస్ఎల్ 11వ సీజన్ వేళ ఐపీఎల్‌కు సవాల్

**లాహోర్/ముంబై:** పక్కోడిపై పడి ఏడవం మరీ ఫ్యాషన్ అయిపోయింది ఆ సారుకు. ఒకసారి ఏకంగా ఒక దేశం గెలిచిన కప్పును ఎత్తుకుపోయి అబాసు పాలైన, తన బుద్ధి మాత్రం ఇంకా మార్చుకోలేదు. ప్రపంచ క్రికెట్‌లో అత్యంత సంపన్నమైన లీగ్‌గా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్ర సృష్టిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఆ సారు ఈ మెగా టోర్నీపై పడి ఏడవడం ప్రారంభించాడు. ఇప్పటికే మీకు అర్థం అయ్యి ఉంటుంది ఆ సారు ఎవరో అనేది. ఆయన మరెవరో కాదు.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ. ఇంతకీ ఆయన ఏం మాట్లాడాడో ఈ స్టోరీలో తెలుసుకుందాం. తాజాగా పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ మాట్లాడుతూ.. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌కు బహిరంగ సవాలు విసిరారు. పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, త్వరలోనే ఇది ప్రపంచంలోనే నంబర్ వన్ ఫ్రాంచైజీ లీగ్‌గా అవతరిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం పీఎస్ఎల్ 11వ సీజన్‌కు సిద్ధమవుతున్న తరుణంలో బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశంలో పాల్గొన్న నఖ్వీ.. ఈ లీగ్ ఇప్పుడు పెట్టుబడిదారులకు అత్యంత ఆకర్షణీయమైన మార్కెట్‌గా మారిందని పేర్కొన్నారు. పీఎస్ఎల్ 2026 ఫ్రాంచైజీ కేటాయింపు ప్రక్రియలో కనిపిస్తున్న భారీ భాగస్వామ్యం పాక్ క్రికెట్ వ్యవస్థపై పెరుగుతున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని, నంబర్ వన్ స్థానాన్ని అందుకోవడం ఎంతో దూరంలో లేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అయితే నఖ్వీ చేస్తున్న ఈ వాదనలకు, క్షేత్రస్థాయిలోని గణాంకాలకు మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఐపీఎల్ మీడియా హక్కుల విలువ సుమారు వి6 బిలియన్లుగా ఉంటే, పీఎస్ఎల్ విలువ కేవలం వి93 మిలియన్ల వద్దే ఉంది. అలాగే ఐపీఎల్ వార్షిక ఆదాయం వి1 బిలియన్ దాటగా, పీఎస్ఎల్ కేవలం వి60 మిలియన్లు మాత్రమే ఆర్జిస్తోంది. ప్రపంచ క్రికెటర్ల సంఘం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో కూడా ఐపీఎల్ 62.2 పాయింట్లతో మూడవ స్థానంలో ఉండగా, పీఎస్ఎల్ 48 పాయింట్లతో ఐదవ స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో 'ది హండ్రెడ్' (75.2) అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇదే సమయంలో ప్రస్తుత పీఎస్ఎల్ సీజన్ వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. స్టార్ బ్యాటర్ ఫఖర్ జమాన్ బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడి రెండు మ్యాచ్‌ల నిషేధానికి గురవ్వగా, టీమ్ హోటల్‌కు అనధికారిక అతిథులను తీసుకువచ్చి భద్రతా నిబంధనలను ఉల్లంఘించినందుకు షహీన్ అఫ్రిది, సికందర్ రజాలపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా మ్యాచ్‌లను కేవలం రెండు వేదికలకే పరిమితం చేయడం వంటి సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, ఐపీఎల్‌ను అధిగమిస్తామన్న నఖ్వీ వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.



## మాజీ భర్త కుటుంబంతో
# నటాషా సందడి

### హార్దిక్ పాండ్యా ఫ్యామిలీతో ఫొటోలు వైరల్
### విడాకుల తర్వాత అనూహ్య పరిణామం

**ముంబై:** మోడల్, సినిమా నటి నటాషా స్టాంకోవిక్ మరోసారి వార్తల్లో నిలిచింది. భారత క్రికెటర్ హార్దిక్ పాండ్యా నుంచి విడాకులు తీసుకున్న నటాషా రెండేళ్ల తర్వాత అందర్నీ ఆశ్చర్యపరుస్తూ అతడి కుటుంబాన్ని కలిసింది. హార్దిక్ తల్లి, సోదరి, అన్నయ్య కృనాల్ పాండ్యా, నానమ్మలతో సరదాగా గడిపింది. కుమారుడు అగస్త్యతో కలిసి వడోదరకు వెళ్లిన నటాషా.. తన మాజీ భర్త కుటుంబంతో దిగిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. ఇటీవలే హార్దిక్ నుంచి ఖరీదైన ఎస్‌యూవీ కారును బహుమతిగా అందుకున్న నటాషా ఇప్పుడు అతడి ఫ్యామిలీకి దగ్గరవ్వడం చర్చనీయాంశంగా మారింది. టీమిండియా స్టార్ హార్దిక్ పాండ్యాతో నాలుగేళ్ల వివాహ బంధాన్ని తెంచుకున్న నటాషా స్టాంకోవిక్ కొన్ని రోజులు స్నేహితుడితో కలిసి తిరిగింది. పాండ్యాతో విడిపోయాక తన ఇన్‌స్టాలో టాక్సిక్ రిలేషన్‌షిప్ పోస్ట్‌లతో వైరలైన నటాషా.. వడోదరలో ప్రత్యక్షమవ్వడంతో అసలేం జరుగుతోంది? అనేది తెలియడం లేదు. కుమారుడు అగస్త్యతో పాటు అక్కడ ఆమె తన మాజీ భర్త పాండ్యా కుటుంబాన్ని కలిసింది. 'బరోడా ఎలా ఉన్నావు?' అనే క్యాప్షన్‌తో ఆమె సోషల్ మీడియాలో ఫొటోలను పోస్ట్ చేసింది.







# గాయపడ్డ సింహం..
# ఓ మంచి పాత్రలో కనిపిస్తా

**నటుడు జేడీ చక్రవర్తి**

కమల్ హాసన్ చేసినన్ని పాత్రలు సినీ చరిత్రలోనే ఎవరూ చేసి ఉండరని నటుడు జేడీ చక్రవర్తి అన్నారు. తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గాయపడ్డ సింహం' మే 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో జేడీ చక్రవర్తి కీలకపాత్రలో నటించారు. ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ తన పాత్ర గురించి చెప్పారు. 'నటులందరికీ కమల్ హాసన్ నటనే ఒక బెంచ్‌మార్క్. ఆయన చేసినన్ని పాత్రలు ప్రపంచ సినీ చరిత్రలో ఎవరూ ఇప్పటివరకూ చేయలేదు. ఇకపై కూడా ఆయన్ని బీట్ చేయడం కష్టమే. ఒక నటుడిగా నేను ఆయనకు ఏ విషయంలోనూ సరితూగను. ఆయనకు రాని అదృష్టం నాకు ఈ సినిమా రూపంలో దక్కింది. ఇందులో నాది అంత గొప్ప పాత్ర. చాలా వేరియేషన్స్ ఉంటాయి. ఇప్పటివరకూ కమల్ హాసన్ కూడా చేయని పాత్ర ఇది. కెరీర్‌లో చాలామందికి జయాపజయాలు ఉండొచ్చు. కానీ, ప్రతిఒక్కరికీ కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర ఒకటి ఉ ంటుంది. నాకు 'మనీ', 'అనగనగా ఒక రోజు' చిత్రాలు ఎప్పటికీ ప్రత్యేకమే. మళ్లీ చాలా ఏళ్ల తర్వాత ఆ సినిమాల్లో పోషించిన లాంటి పాత్ర వచ్చింది' అని జేడీ చక్రవర్తి చెప్పారు. 'గాయపడ్డ సింహం'లో ఎంతోమంది దర్శకులు నటించారని ఇది దర్శకుల చిత్రమని ఆయన అన్నారు.



# లవ్ ఇన్సూరెన్స్ కంపెనీకి ఓటీటీ పోటీ


లవ్‌టుడే, డ్రాగన్ , డ్యూడ్ సినిమాలతో సూపర్ హిట్స్‌ను ఖాతాలో వేసుకున్నాడు తమిళ యాక్టర్ ప్రదీప్ రంగనాథన్. ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ తాజాగా విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ చిత్రంలో నటిస్తున్నాడు. కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ ఏప్రిల్ 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. థియాట్రికల్ రిలీజ్‌కు ముందే ఈ మూవీకి డిజిటల్ ప్లాట్‌ఫాంలో కూడా మంచి డిమాండ్ ఏర్పడింది. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియోతో లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఓటీటీ డీల్ కుదిరినట్టు ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. నాలుగు వారాల థియాట్రికల్ రన్ తర్వాత మిడ్ మేలో ఈ మూవీ ఓటీటీ డెబ్యూ ఇవ్వనుందని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే రిలీజ్ చేసిన ట్రైలర్‌లో ప్రపంచం ఎక్కడికో వెళ్లిపోయింది.. మనమిప్పుడు 2040లో ఉన్నాం. కానీ ఒకడు లేని ఒక విషయాన్ని ఉందనే అంటున్నాడు.. ఉందండి.. ఈ లవ్ ఎట్ ఫస్ట్‌సైట్ ఇంకా ఉందండి. అది ఈ అమ్మాయిని చూడగానే అర్థమైంది. తల నుంచి కాలి వేలి వరకు ఒక ఫీలింగ్ వచ్చింది మామ.. అంటూ సాగుతున్న డైలాగ్స్ యూత్ ఫుల్ స్టోరీతో ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు చెబుతున్నాయి. తమిళంతో పాటు తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ చిత్రం విడుదల కానుందని ఇప్పటికే మేకర్స్ తెలిపారు. ఈ మూవీని రౌడీ పిక్చర్స్, సెవెన్ స్క్రీన్ స్టూడియో బ్యానర్లపై ఎస్ ఎస్ లలిత్ కుమార్‌తో కలిసి నయనతార తెరకెక్కిస్తోంది. ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, యోగి బాబు, సీమాన్, గౌరీ కిషన్, షారా కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

భవిష్యత్‌లో(2040) ప్రేమ ఎలా ఉండబోతుంది అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుందని టీజర్‌లో హింట్ ఇచ్చింది విఘ్నేశ్ శివన్ టీం.

## లవ్ ఇన్సూరెన్స్ ప్రేక్షకులకు నచ్చుతుంది: దిల్ రాజు

'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అంటూ ప్రేక్షకులను కొత్త కాన్సెప్ట్ మూవీతో అలరించేందుకు సిద్ధమయ్యారు ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి. వీరిద్దరూ జంటగా నటించిన ఈ చిత్రాన్ని విఘ్నేశ్ శివన్ తెరకెక్కించారు. నయనతార, ఎస్‌ఎస్ లలిత్ కుమార్ నిర్మించారు. ఈనెల 10న రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకకు దిల్ రాజు, అనిల్ రావిపూడి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ.. ప్రదీప్ రంగనాథన్ నటించిన 'లవ్ టుడే' ప్రేక్షకులకు నచ్చుతుందని ముందే ఊహించినట్లు తెలిపారు. అందుకే తెలుగులో డబ్ చేయించినట్లు చెప్పారు.





# పెద్ది డిజిటల్ హక్కుల కోసం నెట్‌ఫ్లిక్స్ పోటీ


**మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం**

రిలీజ్‌కు ముందే టాలీవుడ్‌లో సంచలనాలు సృష్టిస్తుంది. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ అంచనాలను మరింత పెంచేలా ఓటీటీ హక్కుల విషయంలో భారీ డీల్ కుదిరినట్లు సమాచారం. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ 'పెద్ది' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల కోసం ఏకంగా రూ.130 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. తెలుగుతో పాటు ఇతర భాషల హక్కులు కలిపి ఈ డీల్ కుదిరిందని చెబుతున్నారు. ఒక తెలుగు సినిమా కేవలం ఓటీటీ రైట్స్ ద్వారానే ఇంత భారీ మొత్తాన్ని రాబట్టడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ఇంకా ఆసక్తికర విషయం ఏమిటంటే, సినిమా థియేటర్లలో సాధించే విజయాన్ని బట్టి అదనంగా రూ.20 కోట్ల బోనస్ ఇవ్వాలని కూడా నెట్‌ఫ్లిక్స్ ప్రతిపాదించిందట. అంటే 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిస్తే, మొత్తం డిజిటల్ డీల్ విలువ రూ.150 కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. ఇది రామ్ చరణ్‌కు ఉన్న గ్లోబల్ మార్కెట్ క్రేజ్‌ను మరోసారి నిరూపిస్తోందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందిస్తున్నారు. ఈ కాంబినేషన్ సినిమాపై అంచనాలను మరింతగా పెంచింది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుని, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్ చరణ్ 'పెద్ది పహిల్వాన్'గా, అలాగే క్రికెటర్‌గా రెండు భిన్నమైన షేడ్స్‌లో కనిపించబోతున్నాడు. నటన, బాడీ లాంగ్వేజ్ పరంగా ఇది ఆయన కెరీర్‌లో మరో కొత్త ఛాలెంజ్‌గా భావిస్తున్నారు అభిమానులు. ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, థియేటర్లలో విడుదలైన నాలుగు వారాల తర్వాత ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉంది. మొత్తంగా, రిలీజ్‌కు ముందే భారీ డీల్‌తో 'పెద్ది' సినిమా ట్రేడ్ వర్గాల్లోనే కాకుండా అభిమానుల్లోనూ భారీ హైప్ క్రియేట్ చేస్తోంది.




# వారాణాసిలో మరో బాలీవుడ్ నటి?

మహేష్ బాబు హీరోగా రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న అడ్వెంచర్ ఎపిక్ 'వారణాసి'. ఈ చిత్రాన్ని రాజమౌళి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తుండగా, ఆర్ మాధవన్ కూడా ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఈ మూవీపై రోజుకో ఆసక్తికర వార్త బయటకు వస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో వేసిన భారీ వారణాసి సెట్‌లో మహేష్‌బాబు (రుద్ర), ప్రియాంక చోప్రా (మందాకిని)పై కీలక సన్నివేశాలను రాజమౌళి చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్ ముగియగానే ఒక గ్రాండ్ సాంగ్ షూటింగ్ జరగనుందని, అందులో మహేష్ బాబు సరసన నటించేందుకు మరో బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌ను చిత్రబృందం సంప్రదించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రియాంక చోప్రా తన పాత్ర కోసం ఒక అదిరిపోయే డ్యాన్స్ నెంబర్ ఉండాలని కోరగా, ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. ఇక హాలీవుడ్ స్థాయి విజువల్స్ కోసం అంటార్కిటికా వంటి లొకేషన్లలో కూడా షూటింగ్ జరిపిన జక్కన్న, ఈ స్పెషల్ సాంగ్‌ను విజువల్ వండర్‌గా తీర్చిదిద్దబోతున్నారట. ఏప్రిల్ 7, 2027న ఉగాది కానుకగా విడుదల కాబోతున్న ఈ చిత్రం, భారతీయ సినిమా చరిత్రలో సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**